www.prajaswaramdaily.com
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
మెదక్ | సంపుటి : 17 | సంచిక : 309 | పేజీలు : 11 | వెల : 1
Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | శుక్రవారం 19-07-2024

MHR TV
www. mhrtv.com



సెక్రటేరియట్ లో రైతుకు రుణమాఫీ చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్, మంత్రులు

**తొలివిడత రుణమాఫీ పూర్తి**

**అకౌంట్లో రూ.లక్ష జమ**

**రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు**

## పల్లెపల్లెనా...

# రైతన్న సంబురాలు


హైదరాబాద్ గాంధీ భవన్ లో పటాకులు కాల్చుతున్న కాంగ్రెస్ శ్రేణులు

- సచివాలయంలో ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- సుమారు 11.42 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి
- నెలాఖరులోగా లక్షన్నర మాఫీ చేయనున్న ప్రభుత్వం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు రైతులతో మాట్లాడిన ముఖ్యమంత్రి
- సీఎం, రాహుల్ గాంధీ చిత్ర పటాలకు క్షీరాభిషేకాలు
- పటాకులు పేల్చి, కేక్ లు కట్ చేసి హర్షాతిరేకం
- పలుచోట్ల కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీలు
- కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

**హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం):** తెలంగాణలోని రైతులకు రేవంత్ రెడ్డి సర్కారు రుణమాఫీ కానుక ఇచ్చింది. తొలి విడతలో లక్ష లోపు రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేసింది. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి బటన్ క్లిక్ చేయగానే నేరుగా రైతుల ఖాతాల్లోకి ఏకకాలంలో రుణమాఫీ సొమ్ము జమ అయింది. సుమారుగా 11.42 లక్షల మంది లబ్ధిదారులకు రుణమాఫీ కింద దాదాపు రూ.7 వేల కోట్లు ప్రభుత్వం చెల్లించింది. రైతులను మూడు కేటగిరీలుగా విభజించి రుణమాఫీ చేయాలని సర్కారు నిర్ణయించింది. తొలి విడతలో లక్షలోపు, రెండో విడతలో లక్షా యాభై వేలు, మూడో విడతలో 2 లక్షల వరకు రుణాలు మాఫీ చేయనున్నది. బ్యాంకులు, పీఏసీఎస్ నుంచి ఇప్పటికే సేకరించిన వివరాలన్నింటినీ నేషనల్ ఇన్ఫర్మేషన్ ఇస్తున్నారు. మొత్తంగా రుణమాఫీ పరిధిలోకి వచ్చే రైతు కుటుంబాలు 40 లక్షలు ఉన్నట్లు లెక్క తేలింది. లక్షలోపు రుణాలు ఉన్న రైతుల వివరాలను జిల్లాల వారీగా బుధవారం సాయంత్రమే కలెక్టర్లు, డీఏవోలకు పంపించారు.

ప్రజాభవన్ లో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని ప్రభుత్వం నిర్వహించింది. లక్షలోపు రుణమాఫీకి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిశా నిర్దేశం చేశారు. మాఫీ అయిన మేరకు మళ్లీ కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. రైతు బంధు మాదిరిగానే ఈ కుబేర్ సాఫ్ట్వేర్ సాయంతో రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ప్రొసీడింగ్స్ ను ట్రెజరీకి పంపించారు.

రుణమాఫీకి కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన 20 మంది రైతులకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు చెక్కులు పంపిణీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెలాఖరులోపు రూ.1.5 లక్షలు వరకు ఉన్న రుణాలు, ఆగస్టు మొదటి వారంలో రెండు లక్షల వరకు రుణాలను మాఫీ చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. మొత్తం రుణమాఫీకి రూ.31 వేల కోట్ల అవసరమవుతాయని అంచనాలు ఉండగా, ప్రస్తుతం వెచ్చిస్తున్న రూ.7 వేలు కోట్లు. మరో రూ.24 వేల కోట్లను ప్రభుత్వం సర్దుబాటు చేయాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్లోనే రుణమాఫీ పూర్తి చేస్తే మళ్లీ రైతులు పంట రుణం తీసుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే పంద్రాగస్టులోపు రైతులు రుణం నుంచి విముక్తి పొందనున్నారు . దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికలు, మండల కేంద్రాలు, పల్లెల్లో రైతులు, కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. రుణమాఫీ నిధులు జమ చేసిన రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్ మాట్లాడారు. రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎక్కడికక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు ఈ సంబురాల్లో పాల్గొన్నారు.

రుణమాఫీకి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) రుణం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. రైతుల రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని సంకల్పించిన రేవంత్ సర్కార్ ఆర్థిక వనరులను సమకూర్చుకునే దిశగా తీవ్ర ప్రయత్నాలను చేసింది. ఇప్పటికే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) నిర్వహించే ఈ వేలం ద్వారా ప్రతినెలా సేకరించే మార్కెట్ రుణాలు, రాష్ట్ర రాబడుల నుంచి కొంత మేర నిధులను ఆదా చేస్తూ.. రుణమాఫీ కోసం దాదాపు రూ.10 వేల కోట్లకుపైగా ఖజానాలో మిగతా 2 లో..

**విలేకరులు కావలెను**
**ప్రజాస్వరం**
పదిహేడు సంవత్సరాలుగా
జర్నలిజం రంగంలో
విశిష్ట సేవలందిస్తూ
అత్యంత ప్రజాదరణ
పొందిన ప్రజాస్వరం
తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు,
మండల రిపోర్టర్లు కావలెను.
సెల్ : 800 860 9999

## మరోసారి మోసం



- రైతు బంధు నిధులనే రుణమాఫీకి దారి మళ్లించారు
- 40 లక్షల మంది రుణాలు తీసుకుంటే 11 లక్షల మందినే ఎంపిక చేశారు
- బీఆర్ఎస్ హయాంలో రెండు సార్లు రుణమాఫీ చేశాం
- 37 లక్షల మందికి లబ్ధి చేకూర్చాం
- సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం | 2



## 23 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 24 నుంచి శాసన మండలి...
- 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం | 2
- పది రోజులు పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు

ఈ నెల 23 వతేదీ నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. 25 లేదా 26 తేదీల్లో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశమున్నది. శాఖల వారీగా నిధులు కేటాయించేందుకు సీఎం, డిప్యూటీ సీఎం ఆయా శాఖలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

– హైదరాబాద్, ప్రజాస్వరం



## రాజీనామా చేస్తా..కానీ...

అన్ని హామీలు అమలు చేయాలి

కేవలం రుణమాఫీ పైనే నేను చాలెంజ్ చేయలేదు

ఆరు గ్యారంటీలతో పాటు 13 హామీల సంగతి తేల్చాలి

నాకు పదవి ముఖ్యం కాదు

కాంగ్రెస్ ట్రోల్స్ కు హరీశ్ రావు కౌంటర్ | 2

## పట్టాలు తప్పిన డిబ్రుగఢ్ ఎక్స్ప్రెస్

ఉత్తరప్రదేశ్ గోండాలో ఘటన

నలుగురు మృతి.. 20 మందికి గాయాలు..!

సహాయక చర్యలు చేపట్టిన ప్రభుత్వం, రైల్వే శాఖ | 2






## కవితకు చికిత్స

- దీన్ దయాల్ ఆస్పత్రిలో టెస్టులు
- మళ్లీ తీహార్ జైలుకు తరలింపు
- మరిన్ని వైద్య పరీక్షలకోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు | 2

యూనిక్ ఐడీతో
## ఆరోగ్యశ్రీ | 6

కొత్త కార్డులు ఇచ్చేందుకు సర్కారు చర్యలు

ప్రభుత్వంపై మరో రూ.400 కోట్ల భారం



## భారీ వర్షాలు

- తెలంగాణలో ఐదు రోజుల పాటు వానలు
- కొన్ని ప్రాంతాల్లో అతి భారీగా కురిసే అవకాశం | 2




రుణమాఫీ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, పక్కనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్, మంత్రి నాగేశ్వర్ రావు

# పల్లెపల్లెనా.. రైతన్న సంబురాలు

(మొదటి పేజీ తరువాయి)

జమ చేశారు. ఈ క్రమంలో మరో రూ.5 వేల కోట్లు సేకరించేందుకు ఎన్సీడీసీ రుణాలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. ఈ రుణం నిధులను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా రుణమాఫీకి వినియోగించాలని యోచిస్తోంది. అయితే, ఎన్సీడీసీ నుంచి ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆమోదం రాకపోవడంతో కేంద్ర సహకార శాఖను పర్యవేక్షిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సంప్రదింపు జరుపుతున్నారు. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లా సహకార బ్యాంకులు, 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ద్వారా రైతులకు ఇచ్చిన పంట రుణాలు దాదాపు 5 వేల కోట్ల వరకు ఉన్నాయి. ఈ బ్యాంకులు, సంఘాలు, తెలంగాణ సహకార అపెక్స్ బ్యాంకు (టీ జీసీఏబీ)కు అనుసంధానమై ఉంటాయి. అందుకే ఎన్సీడీసీ నుంచి ముందుగా టీజీసీఏబీ రూ.5000 కోట్ల రుణాన్ని తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. టీజీసీఏబీ నుంచి జిల్లా సహకార బ్యాంకులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రుణం సొమ్మును మళ్లించాలని సర్కారు యోచిస్తోంది. దేశంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన ఎన్సీడీసీ రాష్ట్రాల్లోని టీజీసీఏబీ వంటి బ్యాంకులకు రుణాలు ఇస్తుంటుంది. కానీ, ఈసారి రాష్ట్ర ప్రభుత్వమే మధ్యత్వం నెరుపుతూ టీజీసీఏబికి రూ.5000 కోట్ల రుణం ఇప్పించాలని ప్రయత్నిస్తోంది. ఈ రుణం లభిస్తే రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఊరట లభించనున్నది. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ విషయంలో ముందుకు వెళుతూ ఉండడం పట్ల రైతాంగం నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. మూడు విడతల్లో సుమారు రూ.31 వేల కోట్ల రూపాయలతో రుణమాఫీ పథకాన్ని అమలు చేసేందుకు అనుగుణంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం శరవేగంగా కదులుతుండడం కీలక పరిణామంగానే పలువురు విశ్లేషిస్తున్నారు.

రైతుల సంబురాలు

రుణమాఫీతో తెలంగాణ రైతులు సంబురాలు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వాలు చేయలేని పనిని.. కాంగ్రెస్ సర్కార్ చేసి చూపించిందని అనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతల రుణ మాఫీ సంబరాలు అంబరాన్నంటాయి. మొదటి విడత ప్రకటించిన జాబితాలో వారి రుణాలు మాఫీ అవుతుండడంతో రైతులు ఆనందంతో ఉప్పొంగి పోతున్నారు. పంట పొలాల్లోనే కేక్ కట్ చేసుకుని మిఠాయిలు పంచుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సంబరాలు జరుపుకుంటున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణ మాఫీ మొదటి లిస్టు ప్రకటించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైతులు ఆనం దంతో ఉప్పొంగి పోయారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ వినూత్న రీతిలో సంబరాలు జరుపుకుంటున్నారు . జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ వినూత్న రీతిలో సంబరాలు జరుపుకున్నారు. లక్ష రూపాయల తీసుకున్న రైతుల రుణాలు మాఫీ అవుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తూ వారి వ్యవసాయ క్షేత్రంలోని నారుమడుల్లో సీఎం రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు.. అనంతరం రైతులంతా కలిసి అదే పొలంలో నాగలి గొర్రు కర్రకు కాంగ్రెస్ జెండాను కట్టి ఎగరవేశారు. రుణమాఫీ అవుతున్న ఆనందంతో కేరింతలు కొడుతూ పశువులకు తిలకం దిద్ది ఒకరికొకరు అలయ్ బలయ్ చేసుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. రుణమాఫీ విషయంలో గత ప్రభుత్వాలు మాటలకే పరిమితమయ్యాయన్నారు ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవాళ లక్ష రుణమాఫీ చేసిందన్నారు. అటు దేవరుప్పుల మండలంలో పంట పొలాల్లోనే కేక్ కట్ చేశారు రైతులు. గ్రామ గ్రామాన ఇదే రీతిలో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో వేడుకలు గ్రాండ్ గా జరుపుకున్నారు. అటు మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం కొరవిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు. రుణ మాఫీ హామీ ఇచ్చి తమకు ఆర్థికంగా అండగా నిలిచినందుకు ధన్యవాదాలు చెప్పారు.



ఓయూలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

# రాజీనామా చేస్తా..కానీ..

**అన్ని హామీలు అమలు చేయాలి**

**కేవలం రుణమాఫీ పైనే నేను చాలెంజ్ చేయలేదు**

**ఆరు గ్యారంటీలతో పాటు 13 హామీల సంగతి తేల్చాలి**

**నాకు పదవి ముఖ్యం కాదు**

**కాంగ్రెస్ ట్రోల్స్‌కు హరీశ్ రావు కౌంటర్**



**హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) :** కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చెప్పినట్లుగానే చేస్తే తాను రాజీనామా చేస్తానన్న సంచలన ప్రకటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు స్పందించారు. ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ హామీని అమలు చేస్తే రాజీనామా చేస్తానని ఛాలెంజ్‌పై సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ హడావుడి చేస్తోంది. దీనిపై హరీష్ ఓ ప్రకటన రూపంలో కౌంటర్ ఇచ్చారు.ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ హామీని అమలు చేస్తే హరీశ్ రావు రాజీనామా చేస్తానని చాలెంజ్ విసిరారని, ఆ సంగతేంటో ముందు చెప్పాలని సోషల్ మీడియాలో కాంగ్రెస్ హడావిడి చేస్తోంది.రైతు రుణమాఫీని ముందుగానే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, తమ చిత్తశుద్ధి నిరూపించుకుంటోందని, హరీష్ రావు రాజీనామా చేసి తన మాట నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

ఈ ప్రశ్నలకు హరీష్ తాజాగా సమాధానమిచ్చారు. తానిప్పటికీ రాజీనామా చాలెంజ్ కి కట్టుబడి ఉన్నానని, అయితే తాను చెప్పినట్టుగా కాంగ్రెస్ అన్ని హామీ లు అమలు చేయాలన్నారు.ఎన్నికల వేళ కాంగ్రెస్ మ్యానిఫెస్టో పెట్టిన ఆరు గ్యారెంటీలతోపాటు 13 హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు హరీశ్ రావు. రైతు రుణమాఫీ సహా, అధికారంలోకి వస్తే 100 రోజుల్లోగా అమలు చేస్తామన్న హామీలన్నిటినీ నెరవేరిస్తే తా ను తప్పకుండా రాజీనామా చేస్తానన్నారు హరీష్ రావు. ఆగ స్టు – 15లోపు రుణమాఫీ పూర్తి చేయాలని, దానితోపాటు ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.తనకు పదవి ముఖ్యం కాదని, తన పదవి పోయి నా ప్రజలకు న్యాయం జరిగితే అదే సంతోషమని అన్నారు హరీష్ రావు.తన ఛాలెంజ్ స్వీకరించి అయినా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేస్తే చాలన్నారు. కేవలం రైతు రుణమాఫీపైనే తాను మాట్లాడలేదని, హామీలన్నీ అమలు చేస్తేనే రాజీనామా అని చెప్పానని గుర్తు చేశారు.




అధికారులతో రివ్యూ నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

# కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పై దృష్టి సారించాలి : సీఎం

**హైదరాబాద్, జూలై 18 ప్రజాస్వరం :** కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పురోగతిపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. జిల్లా సాగు నీటి ప్రాజెక్టు లపైన ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కొడంగల్ లో ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. మద్దూరు రెసిడెన్షియల్ క్యాంపస్ నిర్మాణం పై పలు సూచనలు చేశారు. ఇక నుంచి కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై ప్రతి నాలుగు వారాలకోసారి రివ్యూ చేస్తానని సీఎం అన్నారు.

# పట్టాలు తప్పిన దిబ్రుగఢ్ ఎక్స్‌ప్రెస్

**ఉత్తరప్రదేశ్ గోండాలో ఘటన**

**నలుగురు మృతి.. 20 మందికి గాయాలు..!**

**సహాయక చర్యలు చేపట్టిన ప్రభుత్వం, రైల్వే శాఖ**

**లక్నో, జూలై 18:** యూపీలోని గోండాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. గోండా రైల్వే స్టేషన్ సమీపంలో దిబ్రుగఢ్ ఎక్స్ ప్రెస్ పట్టాలు తప్పడంతో చాలా మంది ప్రయాణికులు రైలులోనే చిక్కుకుపోయారు. ఈ రైలు ప్రమాదంలో 12 బోగీలు పక్కకు ఒరిగిపోయినట్లు తెలిసింది. సరిగ్గా గోండా – మంకాపూర్ సెక్షన్ లో ఈ ప్రమాదం జరిగింది. ఈ విషయంపై వెంటనే స్పందించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రమాద స్థలానికి చేరుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారతీయ రైల్వే అధికారులు కూడా సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఉత్తరప్రదేశ్ లోని గోండా రైల్వే స్టేషన్ దగ్గర్లో మధ్యాహ్నం 2:35 గంటలకు చండీగఢ్ – దిబ్రుగఢ్ ఎక్స్ ప్రెస్ పట్టాలు తప్పిందని రైల్వే శాఖ కూడా ఓ ప్రకటన విడుదల చేసింది. రైలు నంబరు 15904. ఈ ప్రమాదంలో 20 మంది వరకు గాయపడినట్టు సమాచారం. దిబ్రుగఢ్– చండీగఢ్ ఎక్స్ ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనపై ఈశాన్య రైల్వే సీపీఆర్వో పంకజ్ సింగ్ మాట్లాడుతూ.. రైల్వే మెడికల్ వ్యాన్ సంఘటనా స్థలానికి చేరుకుందని తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించామని.. హెల్ప్ లైన్ నంబర్లు జారీ చేశామని చెప్పారు. మధ్యాహ్నం 2.37 గంటలకు ఇది జరిగిందని.. ప్రాథమిక సమాచారం ప్రకారం, 4–5 కోచ్ లు పట్టాలు తప్పాయని చెప్పారు.

# 23 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**◆ 24 నుంచి శాసనమండలి... ◆ 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం ◆ పది రోజులు పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు**

**హైదరాబాద్ జూలై 18 (ప్రజాస్వరం) :** శాసనసభ, మండలి సమావేశాలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 23న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కానుంది. శాసనసభ సమావేశాల నేపథ్యంలో జులై 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది కాంగ్రెస్ ప్రభుత్వం. పది రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పది రోజుల్లో రైతు భరోసా, కొత్త ఆర్ఓఆర్ చట్టం, తెలంగాణ లోగో మార్పు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుతో పాటు పలు బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో వరుసగా చర్చలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏయే శాఖలకు కేటాయింపులు ఎలా జరపాలనే అంశంపై సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు అధికారులు.

# అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందిస్తాం

**ప్రతి కుటుంబం ప్రామాణికంగా రూ. 2 లక్షల వరకు వర్తింపు**

**పెద్దపల్లి కలెక్టర్ శ్రీ హర్ష**



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి జూలై 18 (ప్రజాస్వరం):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకం జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు వర్తించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రైతు రుణ మాఫీపై బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రెండు లక్షల రుణమాఫీ పథకాన్ని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రకారం ప్రతి రైతు కుటుంబానికి 2 రెండు లక్షల వరకు అసలు, వడ్డీ మాఫీ అవుతుందని తెలిపారు. రేషన్ కార్డు రైతు రుణమాఫీ పథకం అమలుకు తప్పనిసరి కాదని, రైతు కుటుంబాన్ని గుర్తించేందుకు ఒక ప్రామాణికంగా మాత్రమే రేషన్ కార్డును వినియోగిస్తున్నామని, ఈ అంశంపై రైతుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు రైతులు నూతనంగా తీసుకున్న రుణాలు, రెన్యువల్ చేసుకున్న రుణాలు అసలు, వడ్డీ కలిపి 2 లక్షల రూపాయల వరకు ప్రతి రైతు కుటుంబానికి మాఫీ జరుగుతుందని, రైతు కుటుంబానికి రెండు లక్షల కంటే అధికంగా రుణం ఉన్నట్లయితే కుటుంబంలోని మహిళ పేరు పై రుణాలు నిబంధనల మేరకు ముందుగా మాఫీ అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతు రుణమాఫీ సొమ్ము ప్రభుత్వం జమ చేసిన వెంటనే బ్యాంకులు లోన్ ఖాతా నుంచి సంబంధిత సొమ్మును రైతుల సేవింగ్స్ ఖాతాలోకి బదలాయింపు చేయాలని కలెక్టర్ సూచించారు.

వ్యవసాయ సహకార సంఘాల బ్యాంకులు, డీసీబీ పూల్ కు వచ్చే రుణ మాఫీ సొమ్ము సంబంధిత రైతులకు చేరేలా వ్యవసాయ విస్తరణ అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించా రు. రుణమాఫీ పథకంపై రైతులు ఫిర్యాదులను నమోదు చేస్తే 30 రోజులలో పరిష్కరించడం జరుగుతుంద ని, మన జిల్లాలో ఫిర్యాదుల నమోదు కోసం ప్రత్యేకంగా జిల్లా కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ నెంబర్ సైతం ఏర్పాటు చేశామని, రుణమాఫీ పథకంపై రైతులు తమ సందేహాలను 18005995459 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. రుణమాఫీకి సంబంధించి వచ్చే ప్రతి ఫిర్యాదు జాబితా రూపొందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. రుణమాఫీకి సంబంధించి జారీ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేసి ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా ప్రక్రియ జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో జరుగుతున్న సాగు పనులపై వ్యవసాయ అధికారులతో సమీక్షించారు. క్రాప్ బుకింగ్ ప్రక్రియపై వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పూర్తిస్థాయిలో బుకింగ్ జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. నాట్లు వేసేందుకు అవసరమైన మేర ఎరువుల స్టాక్ జిల్లాలో అందుబాటులో ఉందని, మండల స్థాయిలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయా చెక్ చేసుకోవాలని సూచించారు. రైతు బీమా పథకం క్రింద సంబంధిత రైతు కుటుంబాలకు పది రోజుల కంటే ఆలస్యం కాకుండా సాయం అందేలా చూడాలన్నారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రుణమాఫీ టోల్ ఫ్రీ నెంబర్ 18005995459 ను జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి ప్రారంభించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, ఎల్డీఎం వెంకటేష్, బ్యాంకర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కవితకు వైద్య పరీక్షలు

**❑ మళ్లీ తీహార్ జైలుకు తరలింపు**

**❑ మరిన్ని వైద్య పరీక్షలకోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు**

**న్యూఢిల్లీ జూలై 18:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వైద్య పరీక్షలు చేయించాలని కోర్టు ఆదేశించింది. కవితకు అనారోగ్యంగా ఉండటంతో మంగళవారం ఢిల్లీలోని దీన్ దయాల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన తర్వాత మళ్లీ జైలుకు తరలించారు. దీంతో కవితకు వైద్య పరీక్షల కోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# భారీ వర్షాలు

**❑ తెలంగాణలో ఐదు రోజుల పాటు వానలు**

**❑ కొన్ని ప్రాంతాల్లో అతి భారీగా పడే అవకాశం**

**హైదరాబాద్ జూలై 18 (ప్రజాస్వరం):** తెలంగాణలో రాబోయే ఐదురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొన్నది. ఈ మేరకు మూడురోజుల పాటు పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. పశ్చిమ మధ్య ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని, రాబోయే రెండుమూడు రోజుల్లో బలపడి వాయువ్య దిశగా ఒడిశా తీరం వైపు కదిలే అవకాశం ఉందని తెలిపింది. ఇక తెలంగాణలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# మరోసారి కాంగ్రెస్ మోసం

**ట్విట్టర్‌లో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్ జూలై 18 (ప్రజాస్వరం):** రైతులకు రుణమాఫీ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గురువారం ఆయన తన ట్విట్టర్ లో ఇందుకు సంబంధించి ట్వీట్ చేశారు. రైతుబంధు కింద జూన్ నెలలో ఇవ్వాల్సిన నిధులలోంచే రు. 7000 కోట్లు రుణ మాఫీకి దారిమళ్లించారని మండిపడ్డారు. హక్కుగా రావాల్సిన రైతుబంధు డబ్బు నుంచి కొంత మొత్తం విదిల్చి, రుణమాఫీ చేస్తున్నామని ఫోజులుకొడుతున్నారని దుయ్యబట్టారు. 40 లక్షల పైచిలుకు రైతులు లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందినే ఎట్లా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు.

2014, 2018లో కేసీఆర్ సర్కార్ రుణమాఫీతో పోలిస్తే పావు వంతు రైతులకే అర్హతనా? 2014 లోనే కేసీఆర్ సర్కార్ లక్షలోపు రుణాలను మాఫీ చేయడానికి రూ. 16,144 కోట్లు వెచ్చించి సుమారు 35 లక్ష ల రైతులకు లబ్ధి చేకూర్చిందని తెలియజేశారు. 2018లో అదే లక్షలోపు రుణమాఫీకి రూ. 19, 198 కోట్లు అంచనా కాగా, మొత్తం లబ్ధిదారుల సంఖ్య సుమారు 37 లక్షలుగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు రూ. 2 లక్షల వరకూ ఉన్న పంటరుణాలు అన్నీ వెంటనే మాఫీ చేయాలని, అర్హులైన అందరు రైతు లకూ రైతుబంధు విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లక్ష లోపు రుణమాఫీలో వాస్తవాలు ఇలా ఉన్నాయని వివరిం చారు. లక్ష లోపు రుణాల మాఫీకి రూ. 19 వేల కోట్లు అవసరం కాగా రూ. 7 వేల కోట్ల లోపునకు ఎలా తగ్గిందని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇచ్చిన రూ. 12 వేల కోట్లు పోగా మిగిలిన రూ. 7000 కోట్లు మాత్రమే ఇప్పుడు ఇస్తున్నారా! అని అడిగారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2014, 2018 రెండుసార్లు ఒక లక్ష లోపు రుణ మాఫీ చేసిందని, 2014లో మొదటిసారి రూ. 1 లక్ష లోపు రుణ మాఫీ చేయడానికి అయిన సొమ్ము సీఎం రేవంత్ రెడ్డి మాటల్లో రూ. 16,000 కోట్లు అని, 2018 తరువాత లక్ష లోపు రుణ మాఫీ చేయడానికి కావాల్సిన నిధులు రూ.19,198 కోట్లు అవసరం అవుతాయని కేసీఆర్ ప్రభుత్వం అంచనా వేసిందని కేటీఆర్ చెప్పారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం రూ. 12 వేల కోట్లు రైతుల ఖాతాల్లో అప్పట్లో జమ చేసింది అని స్వయంగా రేవంత్ రెడ్డే చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు లక్ష లోపు రుణాలకు రూ. 7 వేల కోట్లు విడుదల చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, నిధులు ఇంతగా ఎందుకు తగ్గాయి అనేదానికి ప్రభుత్వం దగ్గర సమాధానం లేదన్నారు. అసలు వాస్తవం ఏంటంటే.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించినట్లు లక్ష లోపు రుణాలు మాఫీ చేయడానికి రూ.19,198 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేసిన దాంట్లో రైతుల ఖాతాలో వేసిన సొమ్ము రూ. 12 వేల కోట్లు పోగా మిగిలిన రూ. 7 వేల కోట్లు ఇస్తున్నట్లుగా కనిపిస్తుందని కేటీఆర్ చురకలంటించారు.

# తెరుచుకున్న రత్న భాండార్

**భువనేశ్వర్, జూలై 18:** పూరీ జగన్నాథుడి అమూల్య నిధి భద్రపరిచిన రత్న భాండార్ ను అధికారులు జూలై 19 గురువారం మరోసారి తెరిచారు. 46 ఏళ్ల తర్వాత ఆదివారం తొలిసారి రత్నభాండాగారాన్ని తెరిచిన అధికారులు గురువారం మరోసారి తలుపులు తెరిచారు. రహస్య గదిని తెరిచే ముందు పర్యవేక్షక కమిటీ ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్నాథుడి దర్శనం చేసుకున్న తర్వాతే మరోసారి రత్నభాండాగారాన్ని తెరిచారు. రహస్య గదిలో ఉన్న పెట్టెలోని ఆభరణాలను ఆలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి, ఈ ప్రక్రియ మొత్తం పూర్తైన తర్వాత ఆభరణాలను వేరేచోటుకి తరలించనున్నారు. జగన్నాథుడి దర్శనాన్ని భక్తులు రెండు అంచెల్లో చేసుకుంటారు. కొన్నిసార్లు నాట్యమండపం దగ్గరే భక్తులను ఆపేస్తారు. మరికొన్నిసార్లు జగన్మోహనం వరకూ పంపిస్తారు. ఆ పక్కనే రత్నభాండారం ఉంది. ఇక్కడ మూడు చాంబర్లుంటాయి. మొదటి చాంబర్లో రెగ్యులర్ గా స్వామివారికి వినియోగించే నగలుంటాయి. ఏడాదికి ఐదుసార్లు వీటిని స్వామివారికి అలకరిస్తుంటారు. భాండార్ అధిపతి



దగ్గర ఈ తాళం ఉంటుంది. రెండో చాంబర్లో.. తలుపుకి మూడు తాళాలుంటాయి. ఓ తాళం గజపతి మహారాజుల దగ్గర, రెండో తాళం భాండార్ అధికారి దగ్గర, మూడో తాళం కలెక్టర్ ఆఫీసులో ఉంటుంది..ఈ మూడు తాళాలతో ఒకేసారి తెరవాలి. దీనికి ప్రభుత్వ అనుమతి కావాలి.. 1978లో ఆఖరిసారిగా తెరిచి సంపదను 70 రోజుల పాటు లెక్కించి ఆ లిస్టు ప్రిపేర్ చేశారు. అప్పటి నుంచి మూడేళ్లకోసారి తెరవాలని అనుకున్నప్పటికీ మళ్లీ తెరవలేదు.

2018లో కోర్టు, పురావస్తు శాఖ కూడా తెరవాలని చెప్పడంతో ఓ తాళం పోయిందన్నారు. తాజాగా బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ రత్న భాండార్ తెరిచారు. బయట గది పర్యవేక్షణ ముగించి ఆభరణాలను అక్కడి నుంచి తీసి ఖాళీ చేశారు. లోపల గది తెరిచేందుకు ప్రయత్నించి ప్రయత్నించి చివరకు విరగ్గొట్టి లోనికి ప్రవేశించినట్లు సీఏవో మరోసారి గుర్తు చేశారు. అయితే ఆ రోజు సమయం సరిపోవకపోవడంతో ఆభరణాల తరలింపు ప్రక్రియ చేపట్టకుండా ఆపేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన మార్గదర్శకాల ప్రకారం బయట, లోపల గదుల్లో ఉన్న ఆభరణాల తరలింపు పూర్తయ్యాక... మరమ్మతుల కోసం భారత పురావస్తు శాఖకి అప్పగిస్తారు. పురావస్తు శాఖ మరమ్మతులు పూర్తి చేసిన తర్వాత.. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ లో ఉన్న ఆభరణాలను తిరిగి రత్న భాండాగారంలోకి చేరుస్తారు.

జగన్నాథుడి సంపద గురించి ఆలయంలో జయవిజయుల ద్వారం పక్కన గోడపై ఓ శాసనం ఉంటుంది. 1466లో ఎన్నో దండయాత్రల తర్వాత గజపతి రాజులు అంతులేని సంపద ఆలయానికి తీసుకొచ్చారని ఆ శాసనంలో ఉంది.ఇంకా పూరీ ఆలయంలో అనంతమైన సంపద ఉందని చెబుతూ ఎన్నో శాసనాలున్నాయి. ప్రస్తుతానికి ఆభరణాలు వేరేచోటుకి తరలించి, రత్నభాండాగారం మరమ్మతులు పూర్తైన తర్వాత తిరిగి ఆభరణాలను అక్కడే భద్రపరచనున్నారు.



## ప్రోటోకాల్ వివాదం..
### ఎమ్మెల్యే తప్ప అందరూ స్టేజి దిగాలని నినాదాలు

**పటాన్‌చెరు, జూలై 18, (ప్రజా స్వరం) :**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం జిన్నారం మండల పరిధిలోని సోలక్‌పల్లి రైతు వేదికలో గురువారం రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం మొదలు కాగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్‌ను వేదిక మీదకు పిలవొద్దని అతను ఏ హోదాలో వేదికపైకి వస్తారంటూ అడ్డుకున్నారు. వేదికను వెంటనే ఖాళీ చేయాలని మండిపడ్డారు. 10 ఏండ్లు పార్టీ కోసం కష్టపడిన తమను కాదని, ఎవరిని ముందుకొచ్చిన ఊరుకునేది లేదని నినాదాలతో హోరెత్తించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి జిందాబాద్ అంటూ కాటా శ్రీనివాస్‌గౌడ్ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలతో రైతు రుణమాఫీ కార్యక్రమం కొనసాగింది.

# రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయం..
## రైతులను రుణ విముక్తి చేయడమే కాంగ్రెస్ లక్ష్యం
### తెలంగాణ అభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డితోనే సాధ్యం
### డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



**సిద్దిపేట/గజ్వేల్ జూలై 18 (ప్రజా స్వరం) :**

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయమని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలో రైతులతో కలిసి పంట రుణమాఫీ సంబురాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. రైతులను రుణ విముక్తులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ సర్కార్ నెరవేరుస్తుందన్నారు.



కానీ, ప్రతిపక్ష పార్టీలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పంట రుణమాఫీపై హామీనిచ్చారని, సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసి ఆ హామీ నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్షారెడ్డి, మాజీ కౌన్సిలర్లు సుభాష్ చంద్రబోస్, రామచంద్రచారి, సత్యనారాయణ గుప్తా, పట్టణ పార్టీ అధ్యక్షులు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్, నాయకులు లక్ష్మారెడ్డి, సమీర్, మథిన్, సర్దార్‌ఖాన్, గుంటూకు శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, శివారెడ్డి, అస్గర్, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త..
## రుణమాఫీ లింకులు వస్తే ఓపెన్ చేయొద్దు
- మోసానికి గురైతే 1930కి ఫిర్యాదు చేయండి
- జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

**మెదక్, జూలై 18 (ప్రజా స్వరం) :**

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, రైతు రుణమాఫీ పేరుతో లింకులు వస్తే ఓపెన్ చేయొద్దని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఏదైనా ఒక కార్యక్రమం ప్రభుత్వం మొదలు పెట్టగానే సైబర్ నేరగాళ్లు మోసాలు చేయడం అధిక అవుతున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం నేపథ్యంలో ఇదే అదునుగా కొందరు సైబర్ నేరగాళ్లు ఎదో ఒక బ్యాంకు పేరిట, వాట్సాప్‌లో బ్యాంకు పేరు, బ్యాంక్ పిక్చర్ లోగోతో ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని, ఆ లింక్ ఓపెన్ చేసినా.. లేదా ఇనిస్టాల్ చేస్తే ఫోన్ వాళ్ళ కంట్రోల్‌లోకి వెళ్లిపోతుందన్నారు. అంతేకాదు ఫోన్‌కు మెసేజ్‌లు, ఓటీపీలు అన్నీ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తాయన్నారు. దీని ద్వారా సైబర్ నేరస్థులు మన గూగుల్ పే/ ఫోన్ పే, యూపీఐ ద్వారా డబ్బులు దోచేస్తున్నారన్నారు. ట్రెండింగ్‌లో ఉన్న టాపిక్ ద్వారా ఏపీకే ఫైల్స్ పంపి డబ్బులు కొట్టేస్తున్నారన్నారు. ఏదైనా ఏపీకే ఫైల్స్ వచ్చినా లేదా తెలియని లింకులు పంపించినా ఓపెన్ చేయడం కానీ, ఇనిస్టాల్ చెయ్యకూడదన్నారు. ఎవరైనా ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి కాల్ చెయ్యండం లేదా www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

## రైతన్న సుభిక్షంగా ఉండాలి
### ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ అమలు చేశారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన రైతులందరికీ రుణామాఫీ అవుతుందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో జిన్నారం, గుమ్మడిదల మండలంలోని రైతులు ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడన్నారన్నారు. విడతల వారీగా రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని, రైతులందరూ సుభిక్షంగా ఉండి ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు, సీనియర్ నాయకులు గాలి అనిల్‌కుమార్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేశ్, మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ, సొలక్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో సంబురాలు

**వెల్దుర్తి, జులై 18 (ప్రజా స్వరం) :**

ఎన్నికల సమయంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట రుణమాఫీ చేయడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు, టపాసులు కాల్చి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతుల కోరికను రేవంత్‌రెడ్డి ఆగస్ట్ 15 నాటికి పూర్తి స్థాయిలో నెరవేరుస్తారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు తలారి మల్లేశ్, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, హనుమన్న, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, వంగలపర్తి మాజీ సర్పంచ్ రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్ కృష్ణగౌడ్, సీనియర్ కార్యకర్తలు వెంకట్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
### టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు

**గజ్వేల్, జూలై 18 (ప్రజా స్వరం) :**

రైతు సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించిన విధంగా రైతు రుణమాఫీ హామీలు నెరవేరడంతో గురువారం అంబేడ్కర్ చౌరస్తాలో సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకున్నదన్నారు. రైతుల అభివృద్ధి కోసం రుణమాఫీతో పాటు అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కార్యదర్శి నాయని యాదగిరి, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, రచకొండ ప్రశాంత్, ములుగు మండలం అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా గజ్వేల్ రామచంద్రారెడ్డి, మంద నర్సింహులు, బోయిని రామచంద్రం, బోయిని భిక్షపతి, అందోల్ నర్సింహులు, గజ్వేల్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ రైతు రుణమాఫీ
### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, జులై 18 (ప్రజా స్వరం) :**

అర్హులైన రైతులందరికీ రైతు రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం కౌడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, ఎల్డీఎం నరసింహమూర్తి, ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు జిల్లాల్లోని రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి రుణమాఫీపై రైతుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొదటి విడత కింద జిల్లాలో లక్ష రూపాయలలోపు రుణం తీసుకున్న 45,882 మంది రైతుల ఖాతాల్లో 241.82 కోట్ల రూపాయలు జమ చేస్తుందన్నారు. సంబంధిత రైతులకు రుణమాఫీ సొమ్ము చేరేలా బ్యాంకులు వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల



రుణమాఫీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్, లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి, ఆదర్శ రైతు రామకృష్ణ గౌడ్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత

**మెదక్, జులై 18 (ప్రజా స్వరం) :**

ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మరణించిన రైతు కుటుంబానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేయూతనందించారు. మండల పరిధిలోని పేరూరు గ్రామానికి చెందిన వెల్మకన్న నగేశ్ ఇటీవల పొలం వద్ద బోర్ మోటార్ వద్ద కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్ గురువారం బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. దీంతో బాధిత కుటుంబీకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆశా వర్కర్లకు అండగా ఉంటాం
### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**పటాన్‌చెరు, జూలై 18, (ప్రజా స్వరం) :**

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం బాధ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానికం'పై ఫోకస్ పెట్టాలి

బీజేపీ నాయకత్వాన్ని బలపర్చాలి
మోసపూరిత హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది
తెలంగాణలో బీఆర్ఎస్ పనైపోయింది
ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

**మెదక్, జులై 18 (ప్రజా స్వరం) :**

స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులు, కార్యకర్తలు ఫోకస్ పెట్టాలని, నాయకత్వాన్ని బలపర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరితమైన హామీలను స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు వివరించాలన్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వాన్ని బలపర్చుకోవాలని నాయకులు, కార్యకర్తలు సూచించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతు రుణమాఫీ చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి రాష్ట్రానికి నష్టం కలిగించేలా పాలన సాగించిన తెలంగాణ అనే పదాన్ని తీసేసి రాజకీయం చేద్దామని చూసిన



కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇక తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పనైపోయిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీజేపీని అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా అవేమి పనిచేయలేదన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో మోడీ అభివృద్ధి చేసినందుకే మూడోసారి కూడా ఆయనే ప్రధానిగా ఎన్నికయ్యారన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి బీజేపీని గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, కర్ణం పరిణిత, అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్, అసెంబ్లీ కన్వీనర్ మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక







# రుణ మాఫీ.. ఫుల్ ఖుషీ

## రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

## హాజరైన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

### జిల్లాలో జోరుగా రైతుల సంబురాలు

**వికారాబాద్, జూలై 18 (ప్రజా స్వరం):** రైతు రుణమాఫీ2024 నిధుల విడుదల కావడంతో రైతులంతా ఫుల్ ఖుషీ అయ్యారని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం రుణమాఫీ విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం మోమిన్‌పేట్ మండలంలో గల రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో ఉండే రైతులందరికీ రైతు రుణమాఫీ రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ ఉంటుందన్నారు. రైతు రుణమాఫీ అనేది రైతులకు పండగ లాంటిదని, రైతులకు రుణ భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం గొప్పనిర్ణయం తీసుకుందన్నారు. మొదటి విడతలో ఒక లక్ష రూపాయలు రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు. రైతులు రుణమాఫీ కాలేదని అధైర్య పడొద్దని రెండో విడత, మూడో విడతలో రుణమాఫీ చేస్తామన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అండగా ఉండి సలహాలు అందించి రుణమాఫీ పథకంలో అర్హత కలిగిన ప్రతి రైతు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున వ్యవసాయం చేసే రైతులు రుణాల కోసం రెన్యువల్ చేసుకోవాలన్నారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి జిల్లా వ్యవసాయ, మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, వ్యవసాయ అధికారి గోపాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### 46,633 మందికి రూ.256.26 కోట్లు మాఫీ

రాష్ట్ర ప్రభుత్వం గైడ్ లైన్స్ ప్రకారం చేపట్టిన రైతు రుణమాఫీ ద్వారా జమయ్యే రుణం రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నేరుగా రైతులకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా వేల కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తునట్లు పేర్కొన్నారు. జిల్లాలో 46,633 మంది రైతులకు గాను 256.26 కోట్ల రూపాయలు రైతులకు రుణ మాఫీ లభించనుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండ వారి ఖాతాల్లో జమ అయిన రుణమాఫీ రూపాయలను నేరుగా రైతులకే అందేటట్లు చూడాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి రైతు వేదికలో రైతుల లిస్టు డిస్ ప్లే చేయాలన్నారు. రైతులకు సంబంధించిన 1బీ, అదార్ కార్డు, భూమికి సంబంధించిన్ పాస్‌పుస్తకం తదితర డాకుమెంట్స్ తీసుకొని రెనివల్ కోసం బ్యాంకుకు రావాల్సి ఉంటుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో కూడా రైతులకు సంబంధించి వివరాలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేయాలనీ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. 30 రోజుల పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి రైతు రుణమాఫీ రైతులకు చేరేలా చూడాలన్నారు. లిస్టులో రైతుల పేర్లు లేకపోతే కలెక్టరేట్‌లో రుణమాఫీ సహాయ కేంద్రం టోల్ ఫ్రీ నెంబర్లను 9989291049 , 9000470989 సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం యాదగిరి, ఎస్‌బీఐ రిజినల్ మేనేజర్ పల్లం రాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, కోపరేటివ్ బ్యాంకు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రైతు పక్షపాతి

## కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్

**మేడ్చల్, జులై 18 (ప్రజా స్వరం) :** సీఎం రేవంత్ రైతు పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని రాయిలాపూర్ రైతు వేదికలో గురువారం నిర్వహించిన రైతు రుణమాఫీ కార్యక్రమానికి ఆయన హాజరై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న రుణమాఫీ నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. రైతు రుణమాఫీని దశల వారీగా ఆగస్టు నెలలోపే పూర్తి చేస్తామని హామీ నిచ్చారని, కచ్చితంగా నేరవేరుస్తారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రేవంత్ సర్కారు తప్పకుండా అమలు చేస్తుందన్నారు. రైతు రాజ్యమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి సర్కారు పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు గౌడవెల్లి బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాయిపేట శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు సద్ది సురేశ్‌రెడ్డి, రణదీప్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, భేరి ఈశ్వర్, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, అగ్రికల్చర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రుణమాఫీ సంబురాలు..

**ఇబ్రహీంపట్నం, జూలై 17 (ప్రజాస్వరం) :** తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ చేసిన సందర్భంగా ఇబ్రహీంపట్నంలో భారీ ఎత్తున రైతు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ



శివకుమార్, ఉపాధ్యక్షురాలు శ్యామల, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**వికారాబాద్, జూలై 18 (ప్రజా స్వరం) :** ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, ఫిక్స్డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రతా, ప్రమాద బీమా సౌకర్యం, ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని గురువారం తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ సమ్మె సందర్భంగా ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనం 18,000 అమలు చేస్తామని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని, పని భారాన్ని తగ్గిస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చి ఇప్పటి వరకు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఆశ వర్కర్ల సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం 10 లక్షలు కల్పించాలని, మట్టి ఖర్చులు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు సుజాత, లక్ష్మి, శ్రీదేవి, రాజమణి, రమాదేవి, కాంచన, శశికళ, సరిత, సులోచన, రేణుక, అరుణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



# రైతుబాంధవుడు సీఎం రేవంత్‌రెడ్డి

**వికారాబాద్, జూలై 18 (ప్రజాస్వరం):** సీఎం రేవంత్ రెడ్డి రైతు బాంధవుడని వికారాబాద్ కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి అన్నారు. రుణమాఫీ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, అసెంబ్లీ స్పీకర్ గడ్డ ప్రసాద్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు బిళ్లపాటి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ విశ్వనాథం, సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు కిషన్‌నాయక్, మాజీ జడ్పీటీసీ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం యలాల్ మండలంలోని రైతు వేదికలో రైతు రుణమాఫీ సందర్భంగా ఏర్పాటు చేసిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్థానిక నాయకులు, రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు.

- వికారాబాద్, జూలై 18 (ప్రజాస్వరం)

# మొక్కలు నాటాలి

## ఎంపీ ఈటల రాజేందర్



**మేడ్చల్, జులై 18 (ప్రజా స్వరం) :** మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం మండలంలోని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఈటల, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిలు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల మాట్లాడుతూ మనిషి మనుగడకు చెట్లు అవసరమని, మొక్కలు నాటాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వాతావరణం కాలుష్యం మూలంగా మనిషి భరించలేనంత ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. అదేవిధంగా చిన్నారులపై జరుగుతున్న కుక్కల దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇటీవల జవహర్‌నగర్‌లో ఓ బాలుడిపై జరిగిన కుక్కల దాడిపై ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్లు బాలరాజు, అమరం సరస్వతిమోహన్‌రెడ్డి, హంసరాని కృష్ణగౌడ్, దొడ్ల మల్లికార్జున్, చింత పెంటయ్య పాల్గొన్నారు.

### తెలంగాణ పచ్చదనంలా మారింది..

**- ఎమ్మెల్యే మల్లారెడ్డి**

ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ భారత దేశంలోనే ఎక్కడలేని పచ్చదనం తెలంగాణ రాష్ట్రంలో ఉందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేశారన్నారు. హరితహారం పేరు మీద మొక్కలు నాటారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామానికి తాగు, సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చేపలు పంపిణీ కార్యక్రమంతో బెస్త సంఘం, ముదిరాజ్ కులస్తులు ధనికులయ్యారన్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా కరువే ఏర్పడిందని వర్షాలు పడటం లేదని ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# అంబరానంటిన.. రైతన్న సంబురం

**వికారాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంట రుణాలను మాఫీ చేసి మాట నిలబెట్టుకుందని తాండూరు ఎమ్మెల్యే బియ్యాని మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో నిర్వహించిన రైతు సంబురాల్లో పాల్గొన్నారు. తాండూర్ నియోజకవర్గంలో నిర్వహించిన సంబురాల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పరిగి నియోజకవర్గంలో జరిగిన రైతు సంబురాల్లో డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ముఖ్యతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

శుక్రవారం, 18 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM

# నేటి నుంచి తెలంగాణ డీఎస్సీ పరీక్షలు



హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) : రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి ఇవాల్టి నుంచి డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 11,062 పోస్టుల భర్తీకి 2.79 లక్షల అప్లికేషన్లు అందగా.. ఆన్‌లైన్ పరీక్షలు ఆగస్టు 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇప్పటివరకు 2,40,727 మంది అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. మొత్తం 14 జిల్లాల్లో 56 ఎగ్జామ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. 10 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేయడంతో అభ్యర్థులు తమ సెల్ ఫోన్లు, వాచీలను తీసేసి సెంటర్లలోకి వెళ్లారు. రోజుకు రెండు విడతల చొప్పున టీచర్ పరీక్షలు జరుగుతాయి.

### డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ ఇదే..

- జులై 18 న మొదటి షిఫ్ట్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ పరీక్ష
- జులై 18 సెకండ్ షిఫ్ట్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పరీక్ష
- జులై 19న సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష
- జులై 20న ఎస్‌జీటీ, సెకండరీ గ్రేడ్ ఫిజికల్, స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షలు
- జులై 22 స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ పరీక్ష
- జులై 23 న సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష
- జులై 24న స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్ పరీక్ష
- జులై 26న తెలుగు భాషా పండిట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష
- జులై 30న స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ పరీక్ష

## వెంటనే

# కొత్త రుణాలు




### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

### రుణమాఫీపై బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం

### మరికొద్ది సేపట్లో అకౌంట్లలో డబ్బు

హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులను రుణమాఫీకే వినియోగించాలని.. ఇతర అప్పులకు ఎట్టి పరిస్థితుల్లోనూ జమ చేయొద్దని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రుణమాఫీ కింద వచ్చిన నిధులను బ్యాంకర్లు జమ చేసుకొని భవిష్యత్తు అవసరాల కోసం రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని, లోన్లు ఇచ్చే విషయంలో ఎక్కడ అశ్రద్ధ చూపొద్దని సూచించారు. ఈ విషయంలో లీడ్ బ్యాంకు పెద్దన్న పాత్ర పోషించాలన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రజాభవన్ లో బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రైతు రుణమాఫీ దేశంలోనే చరిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. ఆగస్టు నెల దాటకముందే రూ. 31 వేల కోట్లు రుణమాఫీ కింద విడుదల చేస్తామని, ఇవాళ సాయంత్రం 4 గంటలకు 11 లక్షల పైబడి రైతులకు రూ.6,000 కోట్ల పైబడి నిధులు విడుదల చేస్తున్నామని వివరించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు నెల దాటకముందే రుణమాఫీ కింద రూ.31వేల కోట్ల నిధులను విడుదల చేస్తాం. గురువారం సాయంత్రం 4 గంటలకు 11 లక్షలకు పైగా రైతులకు రూ.6వేల కోట్లు విడుదల చేస్తున్నాం. ఈ నెలలలోనే రెండో దఫా రూ.లక్షన్నర వరకు బకాయి ఉన్న రైతులకు, ఆ తర్వాత రూ.2లక్షల వరకు రుణాలకు నిధులు విడుదల చేస్తాం. రూ.2 లక్షలకు పైబడి రుణం ఉన్న రైతులతో బ్యాంకర్లు మాట్లాడి మిగిలిన మొత్తాన్ని రికవరీ చేసుకోవాలి. ప్రభుత్వం మంజూరు చేసే రూ.2లక్షలు కలిపి మొత్తంగా ఏ రైతూ రుణ బకాయి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి... అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చేముందు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేతగా నేను రైతు రుణమాఫీ గ్యారంటీ కార్డుపై సంతకం చేసి ప్రచారంలోకి వెళ్లాం. ఇచ్చిన మాటకు కట్టుబడి తూచా తప్పకుండా రైతు రుణమాఫీని అమలు చేసి చూపిస్తున్నాం.. అని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద ప్రోత్సాహమని, రైతుల తరహాలోనే బ్యాంకర్లు కూడా పండుగ చేసుకోవాలని అన్నారు. భవిష్యత్తు అవసరాల కోసం రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని, రుణాలు ఇచ్చే విషయంలో ఎక్కడా అశ్రద్ధ చూపొద్దని ఆదేశించారు.



### నేడు మరోసారి

## తెరుచుకున్న పూరీ శ్రీక్షేత్ర రత్న భాండాగారం

పూరీ, జూలై 18 (ప్రజాస్వరం) : ఒడిశాలోని పూరీ శ్రీక్షేత్ర రత్న భాండాగారం రహస్య గది నేడు మరోసారి తెరుచుకుంది. రహస్య గది తెరిచేందుకు ఉదయం 9.51 నుంచి 12.15 గంటల వరకు శుభముహూర్తంగా పండితులు టైం ఫిక్స్ చేశారు. ఈ నెల 14న తొలి 2 గదుల్లోని సంపదను తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ కు తరలించారు. 46 ఏళ్ల తర్వాత తొలిసారి ఆదివారం రత్న భాండాగారం తెరిచిన అధికారులు సమయాభావం వల్ల వెంటనే గదిని మూసేశారు. గదిలోని పెట్టెల్లో ఉన్న ఆభరణాల జోలికి వెళ్లలేదు. ఈ నేపథ్యంలో గురువారం మరోసారి రహస్యగదిని తెరిచి ఆభరణాలను వేరే చోటుకు తరలించనున్నారు. సంపదను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి.. ఈ భాండాగారాన్ని పురావస్తు శాఖకు మరమ్మతుల నిమిత్తం అప్పగించనున్నట్లు భాండాగారం అధ్యయన సంఘం అధ్యక్షుడు జస్టిస్ బిశ్వనాథ్ రథ్, ఆలయ పాలనాధికారి అరవింద పాఢి తెలిపారు. మరమ్మతులు పూర్తయ్యాక సంపదను మళ్లీ రహస్య గదికి తెచ్చి, ఆభరణాల లెక్కింపు చేపట్టనున్నారు. మరోవైపు రహస్య గది తెరుస్తున్నందున శ్రీక్షేత్రంలోకి గురువారం ఉదయం నుంచే భక్తుల ప్రవేశాన్ని నిలిపివేశారు.

# గ్రూప్ 2 పరీక్ష వాయిదా!!



హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) : బేగంపేట టూరిజం ప్లాజాలో నిరుద్యోగులతో కాంగ్రెస్ నేతలు, ఎంపీ ఛామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మానవతారాయ్, చరణ్ కౌశిక్, బాలలక్ష్మి, కిరణ్ యాదవ్ తదితరులు భేటీ అయ్యారు. నిరుద్యోగులతో చర్చించి వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడానికే సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. నిరుద్యోగుల డిమాండ్ మేరకు గ్రూప్ –2 వాయిదా వేసే అవకాశం ఉందని తెలుస్తున్నది. దీనిపై కాసేపట్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నది.



# శభాష్.. డాక్టర్

ఢిల్లీ, జూలై 18 (ప్రజాస్వరం) రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయం లో మానవత్వం పరిఢవిల్లింది. ప్రాణాపాయంలో ఉన్న వృద్ధుడిని చూసి అక్కడే ఉన్న ఓ వైద్యురాలు తక్షణమే స్పందించారు. వృత్తి ధర్మాన్ని పాటించి ఆయన ఆయువు నిలిపారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారాయి. ఢిల్లీ ఎయిర్ పోర్టు రెండో టర్మినల్ వద్ద బుధవారం 60ఏళ్లు పైబడిన ఓ వృద్ధుడు గుండెపోటుకు గురయ్యారు. ఫుడ్ కోర్టు ఏరియా వద్ద ఉన్నట్టుండి కుప్పకూలారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ మహిళా డాక్టర్ వేగంగా స్పందించారు. ఆ వ్యక్తి ఛాతీపై గట్టిగా నొక్కుతూ సీపీఆర్ చేశారు. ఆమె కృషి ఫలించి సరిగ్గా 5 నిమిషాల తర్వాత ఆ వృద్ధుడు స్పృహలోకి వచ్చారు.ఈ ఘటనను కొందరు ప్రయాణికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు వైరల్ కాగా.. వైద్యురాలిపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



# రీల్స్ చేస్తూ లోయలోకి..

### తీవ్రంగా గాయపడి ఇన్ ఫ్లుయెన్సర్ మృతి

### ఇన్ స్టాలో 2.5 లక్షల ఫాలోవర్స్

ముంబయి, జూలై 18 (ప్రజాస్వరం) : జలపాతం వద్ద రీల్స్ చేస్తూ ఓ మహిళా చార్టెడ్ అకౌంటెంట్ పక్కనే ఉన్న లోయలో పడి మృతి చెందిన ఘటన తాజాగా వెలుగు చూసింది. అన్వీ కామ్దార్ ముంబైలో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. కాగా, ఇటీవల ఆమె రాయ్‌గఢ్‌లోని ప్రఖ్యాత కుంభే జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ రీల్స్ వీడియో రికార్డు చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి 300 అడుగులు లోతున్న లోయలో పడి మృతి చెందారు. స్నేహితులతో కలిసి అక్కడికి షికారుకు వచ్చిన సందర్భంగా ఈ దుర్ఘటన జరిగింది.

స్నేహితుల ద్వారా సమాచారం అందడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమెను మన్‌గావ్‌లోని తాలూకా ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతూ కన్నుమూసినట్టు పోలీసులు తెలిపారు. ఇన్‌స్టాలో యాక్టివ్‌గా ఉండే కామ్‌దార్, నిత్యం షార్ట్ వీడియోలు పోస్టు చేసేవారు.

### హాస్టల్ విద్యార్థుల

## కష్టాలు కంటిన్యూ..

హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) : రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల కష్టాలు కొనసాగుతున్నాయి. తాజాగా హనుమకొండ – హసన్ పర్తిలోని తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ హాస్టల్లో ముగ్గురు విద్యార్థులను ఎలుకలు కరవడంతో అస్వస్థతకు గురయ్యారు. వారిని హసన్ పర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. హాస్టల్ గదుల్లో ఎలుకల బెడద ఎక్కువగా ఉందని ప్రిన్సిపాల్ కు చెప్పినా పట్టించుకోవడం లేదని, గతంలోనూ పలువురిని ఎలుకలు కరిచాయని విద్యార్థులు వాపోయారు.

### లారీ డ్రైవర్ పై దుర్భాషలాడిన ట్రాఫిక్ పోలీస్ పై బదిలీ వేటు

హైదరాబాద్, జైలై 18 (ప్రజాస్వరం) : గండిమైసమ్మ వద్ద లారీ డ్రైవర్ ను దుర్భాషలాడుతూ నెట్టేసిన పోలీసుపై బదిలీ వేటు పడింది. ఈ ఘటనపై కేటీఆర్ ట్విటర్ వేదికగా చేసిన ఫిర్యాదు మేరకు స్పందించిన తెలంగాణ పోలీసులు బాధ్యుడైన అధికారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకొని.. అతడిని ఆ స్టేషన్ నుంచి బదిలీ చేశారు. అంతకుముందు ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్గా మారిన విషయం తెలిసిందే.

### రిమాండ్ రిపోర్ట్‌లో

# సంచలన విషయాలు



హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) : నగరంలో సంచలనంగా మారిన నార్సింగ్ డ్రగ్స్ కేసు రిమాండ్ రిపోర్టు బయటికి రావడం సంచలనంగా మారింది. ఈ కేసుకు సంబంధించి మొత్తం 20 మంది నిందితులు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల్లో ఏడుగురు డ్రగ్స్ పెడ్లర్లు, 13 మంది వినియోగదారులు ఉన్నారు. నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ ఏ–10గా ఉన్నాడు. రిపోర్టులో అంశాలు ఇలా ఉన్నాయి.

'డ్రగ్స్ సరఫరాకు కింగ్ పిన్‌గా నైజీరియానుకు చెందిన ఎబుకా. ఎబుకా నుంచి బ్లెస్సింగ్ అనే మరో నైజీరియన్ ద్వారా ఇండియాలో రాష్ట్రాలకు డ్రగ్స్ సప్లై . ఇప్పటి వరకు 20 సార్లు హైదరాబాద్‌లో డ్రగ్స్ సప్లై చేసినట్టు ఒప్పుకున్న బ్లెస్సింగ్. గౌతమ్ అనే డ్రగ్ పెడ్లర్ ద్వారా రాజమండ్రి, హైదరాబాద్, ప్రకాశం జిల్లాకు చేరుతున్న డ్రగ్స్. 9 నెలల్లో 10 లక్షల రూపాయలను కమిషన్ రూపంలో డ్రగ్ పేడ్లర్ గౌతంకు ఇచ్చిన నైజీరియన్. బండ్లగూడలో ఉన్న లుంబిని కమ్యూనికేషన్స్ ద్వారా డబ్బులు చెల్లింపు. వరుణ్ నుంచి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌కు డ్రగ్స్ సరఫరా. ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, గచ్చిబౌలిలోని కస్టమర్లకు డ్రగ్స్ సప్లై. తన స్నేహితురాలి పేరును తన పేరుగా మార్చుకున్న బ్లెస్సింగ్. తండ్రి బస్సు డ్రైవర్ కావడంతో ఆర్థిక సమస్యలు. ఇంటర్ వరకు చదువుకున్న ఒనుహా. 2017 లో ఫేస్ బుక్‌లో బ్లెస్సింగ్ అనే మహిళతో పరిచయం. బెంగుళూరు వచ్చి బ్లెస్సింగ్ అనే స్నేహితురాలి బట్టల దుకాణంలో ఒనుహా పని చేసినట్లు' పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

### కెమెరాకు చిక్కిన అరుదైన

# అమెజాన్ ఆటవిక తెగ



వెబ్ డెస్క్, (ప్రజాస్వరం) : బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా, ఎవరి కంట పడకుండా పెరూలోని అమెజాన్ అడవుల్లో ఒంటరిగా జీవనం సాగిస్తున్న 'మాష్కో పిరో' ఆటవిక తెగ ఎట్టకేలకు కెమెరా కంటికి చిక్కింది. ఆ తెగకు సంబంధించిన అరుదైన ఫొటోలు, వీడియోలను 'సర్వైవల్ ఇంటర్నేషనల్' అనే సంస్థ విడుదల చేసింది. దట్టమైన అడవుల్లోంచి 'మాష్కో పిరో' తెగ సమూహం ఒక నది ఒడ్డున సేదతీరడం ఫొటోలు, వీడియోల్లో కనిపించింది. 'మాష్కో పిరో' తెగకు సంబంధించిన జాడ, వారి జీవనంపై ఆందోళనలు రేకెత్తుతున్న వేళ ఈ దృశ్యాలు వెలుగుచూశాయి. బ్రెజిల్ సరిహద్దులో ఉన్న ఆగ్నేయ పెరువియన్ ప్రావిన్స్‌లోని మాద్రే డీ డియోస్‌లోని నది ఒడ్డున జూన్ చివరలో ఈ ఫొటోలను తీసినట్టు 'సర్వైవల్ ఇంటర్నేషనల్' రిపోర్ట్ పేర్కొంది. మోంటే సాల్వాడో అనే గ్రామానికి చెందిన యిన్ అనే జాతి ప్రజలు ఇటీవల తాము 50 మందికి పైగా మాష్కో పిరో వ్యక్తులను చూశామని చెప్పారు. ఇక మరో 17 మందితో కూడిన సమూహం అక్కడికి సమీపంలోని ప్యూర్టో న్యూవో అనే గ్రామంలో కనిపించిందని మరో ఎన్‌జీవో తెలిపింది. కాగా దట్టమైన అటవీ ప్రాంతంలో నివసించే 'మాస్కో పిరో' తెగ వారు అరుదుగా కనిపిస్తుంటారని, ఎవరితో పెద్దగా సంభాషించరని సర్వైవల్ ఇంటర్నేషనల్ తెలిపింది.

# తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

## మూడురోజుల పాటు పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్‌ను జారీ

హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) : బీతెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ఈ మేరకు మూడురోజుల పాటు పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. పశ్చిమ మధ్య ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఉన్న అల్పపీడనం సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపింది. అలాగే, వాయువ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని.. రాబోయే రెండుమూడు రోజుల్లో బలపడి వాయువ దిశగా ఒడిశా తీరం వైపు కదిలే అవకాశం ఉందని పేర్కొంది. ఇక తెలంగాణలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.




## తెలంగాణలో యూనిక్ ఐడీతో ఆరోగ్యశ్రీ కార్డులు

హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) : తెలంగాణలో రాజీవ్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని యూనిక్ ఐడీతో ప్రభుత్వం కొత్త కార్డులు ఇవ్వనుంది. దీనినే హెల్త్ ప్రొఫైల్ కు లింక్ చేసి, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఏటా ఆరోగ్యశ్రీకి రూ.1,100 కోట్లు ఖర్చవుతుండగా అదనంగా రూ.400 కోట్లు పెరగొచ్చని అంచనా. కాగా రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అందరికీ ఆరోగ్య శ్రీ వర్తిస్తుందని సీఎం రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు సోకిన కరోనా వైరస్

న్యూయార్క్, జూలై 18 (ప్రజాస్వరం) : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు కరోనా వైరస్ సోకింది. దగ్గు, జలుబు, స్వల్ప అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు వైట్‌హౌస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. డెలావేర్ సముద్ర తీరంలోని తన ఇంట్లో చికిత్స తీసుకుంటున్నట్లు పేర్కొంది. బైడెన్‌కు పాక్స్‌లోవిడ యాంటి వైరస్ డ్రగ్ ఇచ్చినట్లు వివరించింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం చేస్తుండగా లాస్ వేగాస్‌లో ఆయన వైరస్ బారిన పడ్డారని తెలిపింది. దగ్గు, జలుబు ఉండడంతో కోవిడ్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. ఇవాళ ఆయన యునిడోస్‌లో ప్రచారం ప్రసంగించాల్సి ఉండగా అర్థంతరంగా ఆ పర్యటనను నిలిపివేసి డెలావేర్ కు బయలుదేరారు.



## కాకినాడలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం

కాకినాడ, జూలై 18 (ప్రజాస్వరం) : జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా గురువారం ఉదయం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద సభ్యత్వ నమోదును ప్రారంభించారు. వాయిస్: కాకినాడ రూరల్ నియోజకవర్గం జనసేనకు మంచి పట్టు ఉన్న నియోజకవర్గం .దీంతోనే పవన్ కళ్యాణ్ కంటే భారీ మెజార్టీతో నానాజీ ఇక్కడ నుంచి గెలిచారు. సభ్యత్వ నమోదులో కూడా నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుపుతామని ఎమ్మెల్యే నానాజీ వెల్లడించారు .పాత సభ్యత్వాలు రెన్యువల్ చేయించడంతోపాటు కొత్త సభ్యత్వాలు కూడా నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ సభ్యత్వం తీసుకోవడం ద్వారా జీవితానికి భద్రత ఏర్పడుతుందని వెల్లడించారు .పవన్ కళ్యాణ్ తన సొంత నిధులు వెచ్చించి ఇలా సభ్యత్వం తీసుకున్న వారి కోసం ఇన్సూరెన్స్ చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు

## రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై దాడి అత్యంత హేయం

**తీవ్రంగా ఖండించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి**

తిరుపతి, జూలై 18 (ప్రజాస్వరం) : తెలుగుదేశం నేతల దాడిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు పుంగనూరులోని మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసానికి వెళ్లిన మిదున్ రెడ్డిపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్యగా తిరుపతి ఎంపీ గురుమూర్తి అభివర్ణించారు. ఎంపీ మిదున్ రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య బద్దంగ ఎన్నికైన ఒక పార్లమెంటు సభ్యునికే రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం సామాన్య కార్యకర్తలకి ఏవిధమైన రక్షణ కల్పిస్తుందన్నారు. ఒక ఎంపీపై రాళ్ల దాడి చేస్తుంటే రక్షణ కల్పించాల్సిన పోలీసులే చోద్యం చూస్తుంటే ఏవిధమైన ఆటవిక పాలన కొనసాగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేనటువంటి సంస్కృతిని నేటి పాలనలో చూస్తున్నామని అధికారం శాశ్వతం కాదు అనేది గుర్తుంచుకొంటే బాగుంటుందని ఆయన అన్నారు. నేడు మీ వెనుక ఉండి దాడులకు ప్రోత్సహించే నాయకులూ నాడు ఎవరూ ఉండరు అనేది ఆలోచించించాలని అన్నారు.

## పట్టాలు తప్పిన చండీగఢ్-దిబ్రగఢ్ ఎక్స్ ప్రెస్

గోండా(ఉత్తర్ ప్రదేశ్), జూలై 18 (ప్రజాస్వరం) : ఉత్తర్ ప్రదేశ్ లోని గోండా జిల్లాలో గురువారం చండీగఢ్-దిబ్రగఢ్ ఎక్స్ ప్రెస్ పట్టాలు తప్పింది(డీరైల్డ్) అని అధికారులు తెలిపారు. ఎవరైనా చనిపోయారా లేదా అనేది ఇంకా జిల్లా అధికారులు తెలుపాల్సి ఉంది.పోలీసుల కథనం ప్రకారం దిబ్రుగఢ్ కు వెళుతున్న ప్యాసింజర్ ట్రెయిన్ తాలూకు కొన్ని బోగీలు మోతీగంజ్, ఝిలాహీ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు తప్పాయి. సీనియర్ రైల్వే అధికారులు, స్థానిక అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.

## అధికారులు జాగ్రత్తగా పని చేయాలి

నందిగామ, జూలై 18 (ప్రజాస్వరం) : బాబు జగ్జివన్ రామ్ కమ్యూనిటీ హాల్ లో నందిగామ నియోజకవర్గ అధికారిక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విజయవాడ ఎంపీ కేసినేని శివనాద్ (చిన్ని), ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గోన్నారు. ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సమస్యలపై ఒకసారి మీ అందరితో మాట్లాడి తెలుసుకుని మీ అందరితో సమావేశమవ్వడమే ముఖ్య ఉద్దేశం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీ అందరికీ తెలుసు అయినా కూడా ఉన్న కొద్ది వనరులతో ఏ విధంగా పనిచేసుకోవాలి అన్నదానిపై చర్చించుకోవాలి. అందరూ సమిష్టి కృషితో పని చేస్తూ జిల్లాను ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చేదిద్దుకుందామని అన్నారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ భారీ మెజారిటీతో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేద్దాం . తప్పకుండా మీ అందరూ కూడా ఏదైతే ప్రజలు నమ్మకంతో మంచి ఆశతో ఈ అధికారాన్ని ఇచ్చారో ఆ నమ్మకాన్ని మీరు మేము వమ్ము చేయకూడదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను అవగతం చేసుకొని ఏ విధంగా ముందుకు వెళ్లాడానికి సమయం పడుతుంది. ఈలోగా మౌలిక వసతులను చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న ధోరణి వీడి అధికారులు జాగ్రత్తగా పనిచేయాలి. సీఎం చంద్రబాబు నాయుడు పాలన ఎలా ఉంటుందో అందరికీ తెలుసు జాగ్రత్తగా పనిచేయండని అన్నారు.

## ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు చట్టాన్ని ఉల్లంఘించవద్దు

**సంయమనం పాటించాలి**

**హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత**

అమరావతి, జూలై 18 (ప్రజాస్వరం) : రాష్ట్రంలో శాంతి భద్రతలకు (లా అండ్ ఆర్డర్) ఆటంకం కలిగించేందుకు అరాచక శక్తులు ప్రయత్నం చేస్తున్నాయని, అలాంటి వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి అన్నారని మంత్రి అనిత తెలిపారు. క్రిమినల్స్ ను దండించే విషయంలో పార్టీలు, కులాలను పరిగణన లోకి తీసుకునే ప్రసక్తే లేదని, శాంతి భద్రతల (లా అండ్ ఆర్డర్) పరిరక్షణ కోసం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సామాన్య ప్రజల జీవనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా పోలీసులు రక్షణ కల్పించాలని, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామని, ఎక్కువగా దగ్గరి బంధువుల ద్వారానే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

మహిళా, శిశు సంక్షేమ, విద్యా, పోలీసు శాఖల సమన్వయంతో స్పెషల్ డ్రైవ్ కు కమిటీని నియమించి, విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులకు కూడా అత్యాచారాలకు ఆస్కారం ఉన్న కారణాలపై అవగాహన సదస్సులు నిర్వహించ నున్నట్లు మంత్రి అనిత తెలిపారు.

## కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీలను కచ్చితంగా నెరవేరుస్తాం

**ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు**



లక్షెట్టిపేట్, జూలై 18 (ప్రజాస్వరం) : కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. గురువారం మున్సిపాలిటీ లోని రైతు వేదిక లో నిర్వహించిన రైతు రుణమాఫీ సంబరాల్లో ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు హాజరై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొక్కిరాల ప్రేమ్సాగర్ రావు మాట్లాడుతూ...... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఐదు హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని అన్నారు. రైతు రాజ్యమే కాంగ్రెస్ ముఖ్య లక్ష్యం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే గిట్టని వారు అవాకులు చవాకులు పేల్చుతున్నారు.గత ప్రభుత్వం లో అన్ని అబద్ధాలు చెప్పారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్చంద్, వైస్ చైర్మన్ ఎండి ఆరీఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, కౌన్సిలర్ వెంకటేష్,కారుకూరి సత్యం కాంగ్రెస్ నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను రుణవిముక్తి చెయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



నిజామాబాద్/మోర్తాడ్, జులై 18 (ప్రజాస్వరం) : మోర్తాడ్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేస్తున్న రుణమాఫి కార్యక్రమ ప్రారంభోత్సవ వేడుకల్లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టి ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పాల్గొన్నారు. వెయ్యి మంది రైతులు, కాంగ్రెస్ పార్టి ప్రజా ప్రతినిధులు,నాయకులు కార్యకర్తలతో మోర్తాడ్ బస్టాండ్ నుండి రైతు భవనం వద్దకు ర్యాలీగా వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. రైతు భవనం వద్ద ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లోలా రైతులతో కలసివీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల రుణమాఫి ఇప్పటివరకు దేశంలో ఏ ప్రభుత్వం చేయలేదని అన్నారు. సీఎం సాహసం చేసి గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా ఒక్కొక్కటిగా సరిద్దిద్దుకుంటూ రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫి చేయడానికి సిద్ధమయ్యారని అన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతుల గుండెల్లో చిరకాలం నిలిచి పోతుందని అన్నారు. ఎన్నికల సమయంలో రెండు లక్షల రుణమాఫి చేస్తామని చెప్పామని ఇచ్చినా మాటను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టికి అలవాటు అని అన్నారు. మొదటి దశలో నియోజకవర్గంలో 7600 మంది లక్షలోపు రుణాలు ఉన్న రైతులకు, ఈనెల ఆఖరికి 1,50,000 రూపాయల వరకు రుణమాఫి ఆగష్టు 15 లోపు 2 లక్షల రుణమాఫి జరుగుతుందని అన్నారు. రైతు కుటుంబాలకు రెండు లక్షల రూపాయల రుణమాఫి జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రుణవిముక్తి చెయడమే కాకుండా రానున్న రోజుల్లో పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉంటారని వ్యవసాయం పండగ అవుతుందని అన్నారు.కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



నిజామాబాద్ / వేల్పూర్, జూలై 18 (ప్రజాస్వరం) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేసినందుకు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ రమేష్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ నేటి నుంచి ఆగష్టు 15 లోపు 2 లక్షల రుణమాఫి జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉంటారని వ్యవసాయం పండగ అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రైతులు కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీ గారు భాష... భాష

హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) :

డీజీపీగారు.. ఈ భాష మీకు అంగీకారయోగ్యమేనా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్ వైరల్ అయింది. పోలీసుల వ్యవహారశైలిపై డీజీపీని బీ కేటీఆర్ ప్రశ్నించారు. వినరాని భాషలో సాధారణ పౌరుడలపై పోలీస్ సిబ్బంది విరుచుకుపడుతున్నారని మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు గండి మైసమ్మ ఆలయం సమీపంలో ట్రాఫిక్ పోలీసులు ఓ వాహనదారుడిపై చేయిచేసుకుని బూతులు తిట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీన్ని ట్వీట్ చేసిన కేటీఆర్.. డీజీపీ సమాధానం చెప్పాలన్నారు. ఇది పోలీస్ శాఖకు, డీజీపీకి అంగీకారయోగ్యమైన భాషేనా అని డీజీపీని ప్రశ్నించారు. పోలీసులు, ప్రభుత్వ అధికారులకు ప్రజలే జీతాలు చెల్లిస్తున్నారని గుర్తుంచుకోవాలని ప్రజలతో పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు అనేకసార్లు తమ దృష్టికి వచ్చిందన్నారని కేటీఆర్ తెలిపారు. పదుల సంఖ్యలో సోషల్ మీడియాలో వీడియోలు వస్తున్నా పోలీసులు స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలతో వ్యవహరించే విషయంలో పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చారు. హైదరాబాద్‌లో లారీ డ్రైవర్‌పై దుర్భాషలాడిన ట్రాఫిక్ పోలీస్‌పై ఘటనపై పోలీసు శాఖ స్పందించారు. పోలీసులు క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. కేటీఆర్ ట్విటర్ వేదికగా చేసిన ఫిర్యాదు మేరకు తెలంగాణ పోలీసులు చర్యలు తీసుకున్నారు. సైబరాబాద్ జీడిమెట్ల ట్రాఫిక్ లిమిట్స్‌లో జరిగిందని ఈ ఘటన జరిగినట్లుగా తేల్చారు. బాధ్యుడైన అధికారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నామని అతన్ని ఆ స్టేషన్ నుంచి బదిలీ చేశామని తెలిపారు. తాము 24/7 గంటలూ ప్రజలకు సేవ చేయడానికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. సామాన్యుల పట్ల పోలీసుల వ్యవహారశైలి వరుసగా వివాదాస్పదమవుతూనే ఉంది. అనేక సార్లు





దుర్భాషలాడుతూ ఉంటారని ఫిర్యాదులు ఉన్నాయి. ఇలా ఎవరైనా బాధితులు వీడియో తీస్తేనే.. విషయం హైలెట్ అవుతుంది. పోలీసుల తీరు వల్ల ప్రజలు భయపడుతున్నందునే.. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే పద్ధతిని ప్రవేశపెట్టారు. కానీ అదేమీ పెద్దగా ఫలితాలను ఇవ్వలేదు. పోలీసుల నోటి దురుసు తనం వల్ల.. ముఖ్యంగా కొంత మది తీరు వల్ల ఆ శాఖకు చెడ్డ పేరు వస్తోందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## లారీ డ్రైవర్‌ను దుర్భాషలాడిన జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ పై బదిలీ వేటు

హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) :

లారీ డ్రైవర్‌ను దుర్భాషలాడిన జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ యాదగిరిపై బదిలీ వేటు పడింది. ఎస్ఐ యాదగిరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎస్ఐ యాదగిరిని జీడిమెట్ల నుంచి బదిలీ చేసినట్లు తెలిపారు. ప్రజలకు నిరంతరం సేవ చేయడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో పోలీసుల వ్యవహారశైలిపై డీజీపీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (%ఖు=%) ఎక్స్ వేదికగా ప్రశ్నించిన విషయం తెలిసిందే. వినరాని భాషలో సాధారణ పౌరుడిని పోలీస్ సిబ్బంది దుర్భాషలాడటంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు గండి మైసమ్మ ఆలయం సమీపంలో ట్రాఫిక్ పోలీసులు ఓ వాహనదారుడిపై చేయిచేసుకుని, దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందిస్తూ.. ఇది పోలీస్ శాఖకు, డీజీపీకి అంగీకారయోగ్యమైన భాషనా అని ప్రశ్నించారు. పోలీసులు, ప్రభుత్వ అధికారులకు ప్రజలే జీతాలు చెల్లిస్తున్నారని గుర్తుంచుకోవాలని సూచించారు.ఈమధ్యకాలంలో ప్రజలతో పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు అనేకసార్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పదుల సంఖ్యలో సోషల్ మీడియాలో వీడియోలు వస్తున్నా పోలీసులు స్పందించడం లేదని చెప్పారు. ప్రజలతో వ్యవహరించే విషయంలో పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక కేటీఆర్ ట్వీట్‌పై తెలంగాణ పోలీసులు స్పందించారు. ఎస్ఐ యాదగిరిపై బదిలీ వేటు వేసినట్లు, ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసనమండలి సమావేశాలు

**25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం**

హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) :

శాసనసభ, మండలి సమావేశాలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 23 నుంచి శాసనసభ, 24 నుంచి శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 23న ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కానుంది. శాసనసభ సమావేశాల నేపథ్యంలో జులై 25 లేదా 26వ తేదీల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది కాంగ్రెస్ ప్రభుత్వం.పది రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పది రోజుల్లో రైతు భరోసా, కొత్త ఆర్ఓఆర్ చట్టం, తెలంగాణ లోగో మార్పు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుతో పాటు పలు బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో వరుసగా చర్చలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏయే శాఖలకు కేటాయింపులు ఎలా జరపాలనే అంశంపై సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు అధికారులు.

## శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

తిరుమల, జూలై 18 (ప్రజాస్వరం) :

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం తెల్లవారుజామున తిరుమల లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంత్రి రాక సందర్భంగా టీటీడీ జెఈవో వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి గర్భగుడి వద్దకు తీసుకెళ్లారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో ఆయనకు వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం జేఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

**తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..**

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం కోసం 31 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం ( కలుగుతుందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. నిన్న స్వామివారిని 69,029 మంది భక్తులు దర్శించుకోగా 28,547 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 2.90 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు.

## ఆగస్టు 1నుండి అభినయ బహుభాషా నాటకోత్సవం

హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) :

ఈరోజు హైదరాబాద్ లోని తెలంగాణ ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో కమిషనర్ సి.పార్థసారథి గారు అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్- 2024పోస్టర్ ని విడుదల చేశారు. తెలంగాణ సాంస్కృతిక భాషా సాంస్కృతిక శాఖ,అభినయ థియేటర్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్- 2024 లో తెలుగు,కన్నడ,నాగ, మణిపురి,మరాఠీ నాటక ప్రదర్శనలు ఉంటాయని, మొత్తం ఆరు నాటకాలతో పాటు ప్రతిరోజూ ప్రారంభ కార్యక్రమంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయని, ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 18వ జాతీయ బహుభాషా నాటకోత్సవమని, ఆగస్టు1వ తేదీ నుండి 3వ తేదీ వరకు హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రతిరోజూ సాయంత్రం 5.30నిమిషాలకు ప్రారంభమవుతాయని,ఇది అభినయ 70వ నాటకోత్సవమని అభినయ థియేటర్ ట్రస్ట్ ప్రధాన సలహాదారులు సి.పార్థసారథి గారు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీనివాస్, ట్రస్టీ క్రోసూరి సుబ్బారావు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో కన్న కూతురిపై కీచక తండ్రి లైంగిక దాడి

మేడిపల్లి, జూలై 18 (ప్రజాస్వరం) :

కన్న కూతురిపై లైంగికదాడికి పాల్పడిన కీచకుడిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన రాచకొండ కమీషనరేట్ పరిధిలోని మేడ్చల్ జిల్లా మేడిపల్లి పిఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం%ా%.. మేడిపల్లిలోని సాయి నగర్ లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. హాస్టల్ లో ఉండి చదువుకుంటున్న తన మైనర్ కూతురును ఇంటికి తీసుకొచ్చి ఇంట్లో తల్లి లేని సమయంలో బాలికపై బలాత్కారం చేశాడు. అనంతరం జరిగిన విషయం పక్కింటి మహిళకు తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ రోజు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్ కు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

## వివాదంలో పూరీ సినిమా...

హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) :

టాలీవుడ్ దర్శకనిర్మాత పూరీ జగన్నాథ్ తెరకెక్కిస్తున్న డబుల్ ఇస్మార్ట్ మూవీ వివాదంలో చిక్కుకుంది. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' సినిమాకు సీక్వెల్ గా, పూరీ జగన్నాథ్, హీరో రామ్ పోతినేని కాంబినేషన్‌లో వస్తున్న మూవీ డబుల్ ఇస్మార్ట్. ఈ మూవీలోని పాటలో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ వాడిన హుక్ లైన్ వాడి ఆయనను అవమానించారని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. మూవీ టీమ్‌పై బీఆర్ఎస్ నేతలు ఎల్బీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ డైలాగ్ తొలగించకపోతే సినిమా విడుదలను అడ్డుకుంటామని హెచ్చరించారు.డబుల్ ఇస్మార్ట్ సినిమాలోని 'మార్ ముంత చోడ్ చింత..' అనే పాటను మూవీ యూనిట్ విడుదల చేసింది. మరోవైపు మూవీ షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. ఆ సాంగ్ లో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ హుక్ లైన్ 'ఏం జేద్దామంటవ్ మరీ..' అని మాటల్ని వాడేశారు. ఈ పాట రాసిన కాసర్ల శ్యామ్ పై, ఆ పదం వాడిన డైరెక్టర్ పూరీ జగన్నాథ్‌పై, మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ ఐటం సాంగ్‌లో కేసీఆర్ డైలాగ్‌ను వాటం ఏంటని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని, చాలా అభ్యంతరకరమైన విషయం అంటూ ఎల్బీనగర్ పోలీసులకు బీఆర్ఎస్ నేతలు జి. సతీష్ కుమార్, ఎం రజితా రెడ్డి ఫిర్యాదు చేశారు. తెలంగాణ యాస, భాషలను కించపరచడం లాంటివి చేసినా, ఉద్యమనేత బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను కించ పరిచినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. డబుల్ ఇస్మార్ట్ మూవీ సాంగ్ నుంచి ఆ డైలాగ్‌ను తొలగించాలని, లేకపోతే మూవీ దర్శక, నిర్మాతలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలోనూ పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన సినిమా 'కెమెరామెన్ గంగతో రాంబాబు' అప్పట్లో వివాదంలో చిక్కుకుంది. పవన్ కల్యాణ్ హీరోగా, తమన్నా హీరోయిన్ గా వచ్చిన ఆ సినిమాలో తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా సీన్లు ఉన్నాయని పలువురు తెలంగాణవాదులు అప్పట్లో ఆందోళనకు దిగడం తెలిసిందే. ఆ మూవీలో విలన్ క్యారెక్టర్‌ను తెలంగాణ నాయకులను అన్వయించారంటూ మండిపడ్డారు. తెలంగాణలో పలుచోట్ల ఉద్యమకారులు ఆందోళన చేశారు. డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తీరు మారలేదని, డబుల్ ఇస్మార్ట్ మూవీలోని ఐటం సాంగ్‌లో తమ అధినేత కేసీఆర్ డైలాగ్ ను వాడి కించ పరిచే ప్రయత్నం జరిగిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై క్షమాపణ చెప్పి, డైలాగ్ తొలగించాలని లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.మరోవైపు వివాదాలతో ప్రచారం వచ్చిన సినిమాలకు మరింత హైప్ వస్తోంది. డబుల్ ఇస్మార్ట్ మూవీకి కేసీఆర్ డైలాగ్ కావాల్సినంత హైప్ తెచ్చిందని టాలీవుడ్ సర్కిల్ లో వినిపిస్తోంది. మూవీ యూనిట్ ఈ వివాదంపై ఎలా స్పందిస్తుందో అని ఆసక్తి నెలకొంది.

## పుంగనూరులో ఉద్రిక్తత



తిరుపతి, జూలై 18 (ప్రజాస్వరం) :

చిత్తూరులో జిల్లా పుంగనూరులో గురువారం వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి పర్యటన ఉద్రిక్తతలకు దారితీసింది. ఆ పార్టీ మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసానికి మిథున్ రెడ్డి వెళ్లగా.. టీడీపీ కార్యకర్తలు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో రెడ్డప్ప ఇంటి వద్దకు భారీగా చేరుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీ వేధింపులకు గురి చేశారంటూ ఆందోళనకు దిగారు. ఇదే సమయంలో వైసీపీ కార్యకర్తలు సైతం అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాలు పరస్పరం రాళ్లదాడికి దిగాయి. టీడీపీ కార్యకర్తలు 'మిథున్ రెడ్డి గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. అనంతరం ఎంపీని గృహ నిర్బంధం చేశారు. కాగా, ఎన్నికల తర్వాత కూడా ఇప్పటికీ పుంగనూరులో అప్పుడప్పుడూ ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో పోలీసులు భారీగా మోహరించారు.అటు, టీడీపీ నేతల దాడిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు పుంగనూరులోని మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసానికి వెళ్లిన మిదున్ రెడ్డిపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్యగా తిరుపతి ఎంపీ గురుమూర్తి అభివర్ణించారు. ఎంపీపై దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒక పార్లమెంటు సభ్యునికే రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం సామాన్య కార్యకర్తలకి ఏవిధమైన రక్షణ కల్పిస్తుందని నిలదీశారు. ఒక ఎంపీపై రాళ్ల దాడి చేస్తుంటే రక్షణ కల్పించాల్సిన పోలీసులే చోద్యం చూస్తుంటే ఏ విధమైన ఆటవిక పాలన కొనసాగుతుందో అర్థం చేసుకోవాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేనటువంటి సంస్కృతిని నేటి పాలనలో చూస్తున్నామని అధికారం శాశ్వతం కాదు అనేది గుర్తుంచుకొంటే బాగుంటుందని ఆయన హితవు పలికారు. నేడు మీ వెనుక ఉండి దాడులకు ప్రోత్సహించే నాయకులూ నాడు ఎవరూ ఉండరు అనేది ఆలోచించించాలని అన్నారు.అటు, పల్నాడు జిల్లా వినుకొండలోనూ వైసీపీ నేత హత్య తీవ్ర కలకలం రేపింది. రషీద్ అనే వ్యక్తిని జిలానీ అనే మరో వ్యక్తి నడిరోడ్డుపై అంతా చూస్తుండగానే కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. వదిలేయమని ప్రాథేయపడినా నిందితుడు కనికరించలేదు. రషీద్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. సమాచారం అందుకున్న పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేశారు. పాత కక్షలతోనే ఈ దాడి జరిగిందని నిర్ధారించారు.

## ఏపీలో రాక్షస పాలన సాగుతోంది

విజయవాడ, జూలై 18 (ప్రజాస్వరం) :

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని.. లా అండ్ ఆర్డర్ ఎక్కడా కనిపించడం లేదని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. వినుకొండలో వైసీపీ కార్యకర్త దారుణ హత్యపై ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. వైసీపీని అణగదొక్కాలన్న కోణంలో ఈ దారుణాలకు పాల్పడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి నెలన్నర రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్ అంటే హత్యలు, అత్యాచారాలు, రాజకీయ కక్షలతో చేస్తున్న దాడులు, విధ్వంసాలకు చిరునామాగా మారిపోయింది. వినుకొండహత్య ఘటన దీనికి పరాకాష్ట. నడిరోడ్డుపై జరిగిన ఈ దారుణ కాండ ప్రభుత్వానికి సిగ్గుచేటు. ముఖ్యమంత్రి సహా బాధ్యతతో వ్యవహరించాల్సిన వ్యక్తులు రాజకీయ దురుద్దేశాలతో వెనకుండి ఇలాంటి దారుణాలను ప్రోత్సహిస్తున్నారు. అధికారం శాశ్వతం కాదని, హింసాత్మక విధానాలు వీడాలని చంద్రబాబును గట్టిగా హెచ్చరిస్తున్నాను. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతల పరిస్థితులపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టి సారించాలి. వైసీపీ కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దు. వినుకొండలో టీడీపీ కార్యకర్తల చేతిలో హత్యకు గురైన రషీద్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.' అని ట్వీట్ చేశారు.నడిరోడ్డుపై వైసీపీ కార్యకర్త దారుణ హత్యతో పల్నాడు జిల్లా మరోసారి ఉలిక్కిపడింది. వినుకొండలో వైసీపీ యువజన విభాగ నేత రషీద్‌పై బుధవారం రాత్రి అతని ప్రత్యర్థి జిలానీ కత్తితో దాడి చేశాడు. అందరూ చూస్తుండగానే విచక్షణారహితంగా నరికాడు. ఈ దాడిలో రషీద్ చేతులు తెగిపోయి ఆర్తనాదాలు చేస్తూ వదిలేయమని ప్రాథేయపడ్డా.. నిందితుడు పట్టించుకోకుండా హతమార్చాడు. ఈ హత్యతో స్థానికంగా ఒక్కసారిగా భయాందోళన నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, పాత కక్షలతోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే పట్టణంలో 144 సెక్షన్ విధించారు.మరోవైపు, ఈ హత్య కేసు రాజకీయ రంగు పులుముకుంది. టీడీపీ, వైసీపీ మధ్య ట్వీట్ వార్ నడుస్తోంది. నిందితుడు జిలానీ టీడీపీ సానుభూతిపరుడిగా పేర్కొంటూ వైసీపీ విమర్శల దాడికి దిగగా.. టీడీపీ ఈ విమర్శలను తిప్పికొట్టింది. వ్యక్తిగత హత్యలతో జరిగిన హత్యలకు రాజకీయ రంగు పులుమవద్దని హితవు పలికింది. గతంలో జిలానీపై రషీద్ దాడి చేశాడని.. ఆ కక్షతోనే ఈ హత్య జరిగిందని దీనికి పార్టీకి ఎలాంటి సంబంధం లేదని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. నిందితుడిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేసినట్లు స్పష్టం చేశారు.

## ఏపీలో ఆగని దారుణాలు

తిరుపతి, జూలై 18 (ప్రజాస్వరం) :

నంద్యాలలోఎనిమిదేళ్ల బాలికపై ముగ్గురు మైనర్ల అత్యాచారం, విజయనగరం జిల్లాలో పసికందుపై వృద్ధుడి అత్యాచార ఘటనలు మరువక ముందే తిరుపతిలో మరో దారుణం వెలుగుచూసింది. ఎనిమిదేళ్ల చిన్నారికి బిస్కెట్లు ఆశ చూపిన మానవ మృగాడు అత్యాచారం చేసి చంపేశాడు. ఈ అమానుష ఘటన తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ నుంచి వలస వచ్చిన కొన్ని కుటుంబాలు గ్రామంలోని ఓ రైస్ మిల్లులో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందులో పని చేస్తోన్న భార్యాభర్తల రెండో కుమార్తె (8)ను అదే మిల్లులో పని చేస్తోన్న బీహార్‌కు చెందిన ఓ యువకుడు (20) బిస్కెట్లు ఇప్పిస్తానని ఆశ చూపి ఉదయం తీసుకెళ్లాడు.

**అటవీ ప్రాంతంలో మృతదేహం..**

బుధవారం మధ్యాహ్నం మిల్లు నుంచి వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు పాప కనిపించకపోయే సరికి ఆందోళనకు గురై స్థానికులతో కలిసి వెతుకులాట ప్రారంభించారు. సాయంత్రం 4 గంటల సమయంలో మిల్లుకు సమీపంలోని అటవీ ప్రాంతంలో మేకల కాపర్లు చిన్నారి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని పరిశీలించారు. బాలిక శరీరంపై గాయాలున్నట్లు గుర్తించారు. నిందితుడు అత్యాచారానికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

**గంజాయి మత్తులోనే..**

నిందితుడు చిన్నారిని తీసుకెళ్లడం సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా.. బాలికకు బిస్కెట్లు కొనేందుకు తీసుకెళ్లానని.. ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని వారికి చెప్పినట్లు తెలుస్తోంది. గంజాయి మత్తులోనే నిందితుడు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, నిందితుడు బాలిక తండ్రితో గంజాయి మత్తులో మంగళవారం రాత్రి గొడవపడ్డాడు. ఆ మరుసటి రోజే ఇలా జరగడంతో కావాలనే ఇలా చేశాడా.? అనే కోణంలోనూ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ఇంటర్ విద్యార్థినిపై..**

మరోవైపు, ఇదే తిరుపతి జిల్లాలో ఇంటర్ విద్యార్థినిపై దారుణం జరిగింది. వినయ్ అనే రౌడీ షీటర్ విద్యార్థినిని కత్తితో బెదిరించి బలవంతంగా ఆటోలో ఎక్కించి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో అవమాన భారంతో కుంగిపోయిన బాధిత విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**విద్యార్థుల ఆత్మహత్యాయత్నం..**

అటు, అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ముదివేడు గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు 9వ తరగతి విద్యార్థులు ఆత్మహత్యకు యత్నించారు. మోతాదుకు మించి మందులు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరు అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించిన తోటి విద్యార్థులు సిబ్బంది విషయం చెప్పగా.. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీశారు.

# ఎర్ర మట్టి దిబ్బలపై సీఎంవో ఆరా...

**నివేదికకు ఆదేశం**

**విశాఖపట్టణం, జూలై 18 (ప్రజాస్వరం) :**

విశాఖలో భౌగోళిక వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఎర్ర మట్టి దిబ్బల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరిగాయి. భీమిలి ఎర్ర మట్టి దిబ్బలను భారీ యంత్రాలతో తవ్వేస్తూ లారీల్లో తరలిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎర్రమట్టి దిబ్బల విధ్వంసంపై ఏపీ సీఎంవో స్పందించింది. తవ్వకాలు నిలిపి వేయాలని జిల్లా అధికారులను ఆదేశించింది. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్యావరణానికి హాని కలిగించే చర్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ తవ్వకాలపై పూర్తి వివరాలతో నివేదిక అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ను ఆదేశించింది.ఎర్రమట్టి దిబ్బలు ముప్పులో ఉన్నాయని పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారుల అండదండలతో కొందరు యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఎర్రమట్టి దిబ్బల్లో తవ్వకాలు జరగగా...వివాదాస్పదం అయ్యింది. తాజాగా మరోసారి ఈ విషయం తెరపైకి వచ్చింది. విశాఖ భీమిలి ఎర్రమట్టి దిబ్బల అక్రమ తవ్వకాలపై ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని విశాఖ జేసీ మయూర అశోక్ తన బృందంతో పరిశీలించారు. ఏ మేరకు తవ్వకాలు జరిపారో అంచనా వేసి నివేదిక సిద్ధం చేస్తున్నారు. తవ్వకాలపై నివేదిక అందించాలని సీఎంవో ఆదేశించింది.విశాఖ జిల్లా భీమిలి కో ఆపరేటివ్ సొసైటీకి చెందిన భూములు ఎర్రమట్టి దిబ్బల్లో ఉన్నాయి. ఇక్కడ లేఅవుట్ వేసేందుకు 2016లో వీఎంఆర్డీఏకి దరఖాస్తు చేసుకోగా అనేక షరతులు విధించింది. భూవినియోగ మార్పిడి ఫీజు చెల్లించాలని, జిల్లా కలెక్టర్, ఏపీ కోస్టల్ మేనేజ్మెంట్ జోన్, కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ, నేషనల్ మాన్యుమెంట్ అథారిటీ, రక్షణ శాఖ నుంచి అనుమతులు పొందాలని తెలిపింది. భీమిలి కో ఆపరేటివ్ సొసైటీకి చెందిన చెబుతున్న భూమిలో భౌగోలికి వారసత్వ సంపదగా గుర్తించిన ఎర్రమట్టి దిబ్బలు 94.65 ఎకరాల్లో ఉందని, అది మినహాయించి 279.31 ఎకరాలు మాత్రమే సొసైటీకి చెందుతుందని గతంలో వీఎంఆర్డీఏ స్పష్టం చేసింది.సొసైటీ వాళ్లు లేఅవుట్ వేస్తే 75 ఎకరాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఒక్కొక్కరికి 75 గజాలకు మించకుండా ప్లాట్లు కేటాయించాలని అధికారులు ఆదేశించారు. అలాగే ఎర్రమట్టి దిబ్బలు పక్కనే ఉన్నందున బఫర్‌జోన్ ఏర్పాటు చేయాలని సూచించారు. భూవినియోగ మార్పిడి కింద సొసైటీ వీఎంఆర్డీఏకు సుమారు రూ. 3 కోట్లు వరకు ఫీజు చెల్లించింది. మిగిలిన అనుమతులు లేకపోవడంతో అప్పట్లో సొసైటీ దరఖాస్తును వెనక్కి పంపారు. తాజాగా సొసైటీ మళ్లీ లేఅవుట్ వేసేందుకు పనులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇది జీవీఎంసీ పరిధిలో ఉండడంతో.. అక్కడ డబ్బులు కట్టి అనుమతి కోరినట్లు తెలుస్తోంది. అక్కడ కూడా లేఅవుట్ దరఖాస్తు సమర్పించలేదని, భూమి చదును చేయడానికి మాత్రమే రూ.5 కోట్ల వరకు చెల్లించినట్టు తెలుస్తోంది. అయితే జీవీఎంసీ ఎందుకు అనుమతులు ఇచ్చింది, దరఖాస్తు చేసింది ఎవరు, దీని వెనకున్నది ఎవరనేది విచారణలో తెలియాల్సి ఉంది.ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి దిబ్బల్లో తవ్వకాలు జరుగుతున్నాయని భీమిలి తహసీల్దార్ గుర్తించారు. దీంతో ఆయన మంగళవారం తవ్వకాలు జరుపుతున్న ప్రదేశాన్ని పరిశీలించి, పనులు ఆపాల్సిందిగా చెప్పారు. అనుమతులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. వారసత్వ సంపద ప్రదేశం కాబట్టి దిల్లీ స్థాయిలో అనుమతులు కావాల్సి ఉంటుందన్నారు. అయితే ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గత మూడు నెలలుగా పనులు జరుగుతుంటే అధికారులు పట్టించుకోలేదంటే అనుమానాలు కలుగుతున్నాయని పర్యావరణ వేత్తలు అంటున్నారు. ఎర్రమట్టి దిబ్బలను భారీ యంత్రాలతో తవ్వి లారీల్లో మట్టిని తరలించుకుపోతున్నా గనుల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు.

# పుట్ట మధుపై విమర్శలు మానుకోవాలి

**కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ నాయకుల హితవు**

**కమాన్ పూర్, జూలై 18 (ప్రజాస్వరం) :**

నిన్నటి దాకా.. అంటే శాసన సభ ఎన్నికలకు ముందు... ఆ తర్వాత కూడ బీ. ఆర్. ఎస్ పార్టీలో ఉండి పుట్ట మధు కమాన్ పూర్ మండలంతో పాటు మంథని నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి గురించి, బీ. ఆర్. ఎస్ ప్రభుత్వం చేసిన ప్రగతి గురించి పదే పదే చెప్పిన నాయకులే నేడు పుట్ట మధు ఏమి అభివృద్ధి చేశాడంటూ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని కమాన్ పూర్ మండల బీ. ఆర్. ఎస్ నాయకులు ఏద్దేవా చేశారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమాన్ పూర్ జడ్పిటిసి గా పుట్ట మధు గెలిచి పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ గా గెలిచి ఏమి అభివృద్ధి చేయలేదని పార్టీ మారిన నాయకులు విమర్శించడం సిగ్గు చేటన్నారు. నరంలేని నాలుక ఏదైనా మాట్లాడుతుందన్నట్టు పార్టీ మారిన నాయకులు ఆ పార్టీ మంత్రి మెప్పు కోసమే పుట్ట మధు పై అర్థరహిత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. నిన్నటిదాకా గొప్ప నాయకుడు అన్న వారు పట్టుమని పార్టీ మారి పది రోజులు గడువక ముందే మంచోడు చెడ్డోడు అయ్యిండా అని ప్రశ్నించారు. రోజు రోజుకు రాజకీయాల విలువలు నాయకుల వ్యవహార శైలితో మారుతుందన్నారు. మంథని మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ పై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు సరైనవి కాదని హెచ్చరించారు. పుట్ట శైలజ మంథని నుండి ఎంపిటిసి గా, సర్పంచ్ గా పుట్ట మధు ఎమ్మెల్యే కాక ముందే గెలిచిన విషయాన్ని విస్మరించవద్దని హితావు పలికారు. కరోనా కాలంలో పుట్ట శైలజ ప్రజల ఇబ్బందుల పరిష్కారం కోసం చేసిన కృషి ఏమిటో ప్రజలకీ తెలుసునన్నారు. నిత్యం పుట్ట శైలజా, పుట్ట మధు ఇద్దరు దంపతులు మంథని నియోజకవర్గం ప్రజల కష్ట సుఖాల్లో తోడుంటూ వస్తున్నారన్నారు. రాజకీయాల్లో గెలువు ఓటములు సహజమని మంచి మంచి మహానేతలే ఓడినా సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఓడినా.. గెలిచినా నిత్యం మంథని నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నది మాత్రం పుట్ట మధు శైలజా దంపతులేనన్నారు. మంథని నియోజకవర్గంలో ఒక్క ఓటు తో ఇద్దరికీ మంత్రి పదవులు వచ్చాయని.. ఒక్కటి అధికారికంగా ఎమ్మెల్యే శ్రీధర్ బాబుకు అయితే మరొక్కటి అన్నాధికారికంగా మంత్రి సోదరుడు శ్రీను బాబు కు అని ఆరోపించారు. ఎలాంటి ప్రజాప్రతినిధి కాకున్నా పోలీస్ బందోబస్తూ తో.. మంథని నియోజకవర్గంలో మరో మంత్రిగా వ్యవహారిస్తూ పర్యటించడమే ఇందుకు నిలువెత్తు నిదర్శనమని వెల్లడించారు. ఇది మంథనిలో జరుగుతున్న అధికార దుర్వినియోగం కాదా.. దీనికి మంత్రి.. ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. మంథని నియోజకవర్గంలో ప్రజలు వేసిన ఒక్క ఓటుతో ఇద్దరు మంత్రులు రాజ్యాంకుతున్న పరిస్థితి నెలకున్నాదంటే రాజ్యాంగం అమలు తీరు ఎలా ఉందో.. ఎవరికైనా ఇట్టే తెలుస్తుందాన్నారు. బీసీల ప్రతినిధిగా పుట్ట మధు బీసీలకు రాజ్యాధికారంలో హక్కుల కోసం పోరాటం చెందుతున్నాడని, ఎంతోమంది సమాజ హితం కోసం పోరాడిన బీసీ నేతల విగ్రహాలను నెలకొల్పి వారి చరిత్రను బావితరాలకు తెలిసేలా చేసాడన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మంథని నియోజకవర్గం నుండి రాష్ట్ర స్థాయి పదవుల్లో బీసీ లకు, మైనార్టీలకు ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించలేక పోయిందని ఆరోపించారు. మంథని నియోజకవర్గంలో ఒకే ఒక్క అగ్ర వర్ణ నాయకుడికే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి ఇచ్చి బీసీ లపై సవితి తల్లి ప్రేమను ఓలకాబోస్తుందని ఆరోపించారు. బీసీలా పట్ల ప్రేమ ఉంటే మంథని నియోజకవర్గంలోని పెద్దపల్లి జిల్లా కు చెందిన వివిధ మండలాల్లో కాంగ్రెస్ పార్టీకి శక్తి వంచన లేకుండా పని చేసిన వారిని ఎందుకు మంత్రి విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా.. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మంథని మాజీ మున్సిఫల్ చైర్ ఫర్సన్ పుట్ట శైలజలపై అర్ద రహిత విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీ. ఆర్. ఎస్ మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, సిద్దిపల్లె మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, బీ. ఆర్ ఎస్ నాయకులు నీలం శ్రీనివాస్, ఎలాబోయిన రామ్మూర్తి, చొప్పరి శ్రీనివాస్, సాన సురేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నీటి కాలుష్యాన్ని అరికాట్టల్సిన బాధ్యత అందరిదీ

**ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్**

**తాడేపల్లిగూడెం, జూలై 18 (ప్రజాస్వరం) :**

గోదావరి జలాలు, సముద్ర తీర ప్రాంతాలలో వ్యర్థ పదార్థాలను పారవేయడం ద్వారా జరుగుతున్న నీటి కాలుష్యాన్ని అరికట్టవలసిన బాధ్యత ప్రజలందరి పైన ఉందని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారంనరసాపురంలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ మరియు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సముద్ర తీర ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధికి ఆటంకం కాకూడదని అభిప్రాయపడ్డారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో ఉన్న సమస్యలపై ఆయన వాతావరణ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖల అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లారు. తాడేపల్లిగూడెంలో మురుగునీరు పోవడానికి అవుట్ లెట్ లేకపోవడంతో గోదావరి జలాలతో ప్రవహించే ఏలూరు కాలువలోకి వ్యర్థాలు కలుస్తున్నాయని ఈ సమస్య పరిష్కారానికి సహాయ సహకారాలు అందించాలని ఆయన అధికారులను కోరారు. ఎప్పటినుంచో అపరిచితృతంగా ఉన్న తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పున ప్రారంభించి మురుగునీరు నల్లజర్ల రోడ్డు లో ఉన్న మురుగు కాలువకు అనుసంధానం చేసే దిశగా యాక్షన్ ప్లాన్ రూపొందించామని చెప్పారు. తాడేపల్లిగూడెం నీటి కాలుష్యంపై పరిశీలనకు రావాల్సిందిగా అధికారులకు బృందాన్ని ఆయన కోరారు. నీటి కాలుష్యం అరికట్టడం ద్వారా ప్రజారోగ్యం కాపాడుకోవచ్చని ఆయన పలు సూచనలు చేశారు.

# సంత మార్కెట్‌ని పరిశీలించిన ఎమ్మెల్యే అఖిల ప్రియ



**అళ్లగడ్డ, జూలై 18 (ప్రజాస్వరం) :**

ఆళ్లగడ్డ పట్టణంలోని సంత మార్కెట్ ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గురువారం పరిశీలించారు. మార్కెట్లో ఏమి సమస్యలు ఉన్నాయో కూరగాయలు అమ్మే వాళ్ళతో మాట్లాడి అన్నింటిని తెలుసుకుని వెంటనే మున్సిపల్ కమిషనర్ కు చెప్పి త్వరగా అన్ని పనులు చేయాలనీ ఆదేశించారు. మార్కెట్లో చాలావరకు చెత్త ఎక్కడపడితే అక్కడ ఉంది చాలా బ్యాడ్ స్మెల్ రావడంతో ఇదంతా క్లీన్ చేసి మార్కెట్ అంతా నీట్ గా ఉండాలని ఎమ్మెల్యే భూమ అఖిలప్రియ పేర్కొన్నారు మార్కెట్లో ఆవుల బెడద ఎక్కువగా ఉందని కమిషనర్ గారికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని మాకు న్యాయం చేయాలని కూరగాయల అమ్మే వారందరూ భూమా అఖిలప్రియ కి కంప్లైంట్ ఇవ్వడం జరిగింది తక్షణమే కమిషనర్ కు చెప్పి ఆవుల యజమానులను పిలిపించి పంపించాలని ఆదేశించారు.. మార్కెట్లో లైట్లు లేవని తాగునిరు సరిగా లేదు అని వాటర్ థాంక్యూ ఉన్నా కూడా క్లీనింగ్ అస్సలు చేయట్లేదని ఆ నీరు తాగితే రోగాలు వస్తాయని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కి తెలియజేశారు వెంటనే స్పందించి ట్యాంక్ క్లీన్ చేసి లైటింగ్ వేయాలని ఆదేశించారు.అలాగే మార్కెట్లో అందరికీ మేము అన్ని చేసి పెడతాము కానీ మీరు మాత్రం నాణ్యమైన కూరగాయలే అమ్మాలని నాసిరకం అమ్మితే ప్రజలకు రోగాలు వస్తాయని పేర్కొన్నారు.

# రోడ్లపై డ్రైనేజీ నీరు

**భద్రాచలం పట్టణంలో ఆక్రమణకు గురైన డ్రైనేజీలు**

**భద్రాచలం, జూలై 18 (ప్రజాస్వరం) :**

చర్ల రోడ్డులో ఉన్న డ్రైనేజీలను ఆక్రమించిన కొందరు వాటిపై నిర్మాణాలు చేయడంతో నీరు రోడ్లపైకి చేరింది. చర్ల రోడ్డులో మోకాలు లోతు డ్రైనేజీ నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# అనంతారాన్ని చుట్టుముట్టిన వరద నీరు

**అశ్వరావుపేట, జూలై 18 (ప్రజాస్వరం) :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం అనంతారం గ్రామం వద్ద వాగులు పొంగిపొర్లుతున్నారు.వరద నీరు అనంతారం గ్రామాన్ని చుట్టుముట్టాయి. గుబ్బల మంగమ్మ ప్రాంతం నుంచి వచ్చే వరద అనంతాతరం గ్రామం వద్దకు వచ్చే సమయానికి వరద ఉధృతి పెరిగి రెండు పాయలుగా చీలే వాగు మధ్యలో కెసిఆర్ కాలనీ నిర్మించడంతో కాలనీవాసులంతా వరదలో చిక్కుకున్నారు. ఈ కెసిఆర్ కాలనీలో 20 డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం నిర్మించడం జరిగింది. ఈ రెండుగా చీలిన వాగుపై రెండు బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టడం జరిగింది. ఈ బ్రిడ్జిలు పైనుంచి వరద పొంగి ప్రవహిస్తుండటంతో కాలనీవాసులు భయాందోళనలో ఉన్నారు. ఇదే గ్రామంలో ఉన్న గిరిజన బాలికల వసతి గృహం సైతం వరద నీటితో మునిగిపోయింది.

## సింగరేణిని ప్రైవేటు పరం చేయవద్దు

**హైదరాబాద్, జూలై 18 (ప్రజాస్వరం) :**

సింగరేణి బొగ్గు గనుల ను ప్రైవేటు పరం చేయకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని కార్మిక సంఘాలు ఇచ్చిన రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమం లో బీ ఆర్ ఎస్ కార్మిక విభాగం ,తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు .రాజ్ భవన్ ముందు నిరసనకు దిగిన బీ ఆర్ టీ యూ నేత రాం బాబు యాదవ్ ,తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కాపు కృష్ణ తదితరులను పోలీసులు అరెస్టు చేసి ఎస్ ఆర్ నగర్ స్టేషన్ కు తరలించారు .అక్రమ అరెస్టులను బీ ఆర్ టీ యూ ,టీజీబీకేఎస్ నేతలు ఖండించారు.

# శిల్పా వెంచర్స్ నిర్వాహకులపై చర్యలు



**ఆళ్ళగడ్డ, జూలై 18 (ప్రజాస్వరం) :**

ఆళ్ళగడ్డ లోని పురపాలక సంఘ భవనంలో మున్సిపల్ చైర్మన్ డా. రామ లింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ హాజరయ్యారు. ఎమ్మెల్యే అఖిల ప్రియ అధికారులు, కౌన్సిలర్లతో కలిసి ఆళ్ళగడ్డ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన, నిలిచిన అభివృద్ధి, కాలనిలలో రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు, పారిశుధ్యం తదితర అంశాలపై చర్చించారు. నిలిచిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆళ్ళగడ్డ పట్టణంలో ఇప్పటికీ ఉన్న అన్నా క్యాంటీన్ ను త్వరలో పునరుద్ధరణ చేస్తామని అలాగే మరొక అన్నా క్యాంటిన్ ను ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణకు గురైన కెనాల్ కాలువ ను పరిశీలించడం జరిగిందని ఎమ్మెల్యే అఖిల ప్రియ అన్నారు.ప్రభుత్వంచే ఎటువంటి అనుమతులు లేకుండా కాలువను ఆక్రమించిన శిల్పా వెంచర్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అఖిల ప్రియ అన్నారు.

# తిరుమలలో అడ్డగోలు కల్తీ

**తిరుమల, జూలై 18 (ప్రజాస్వరం) :**



వెంకటేశ్వర స్వామి దర్శించుకోవడానికి రోజుకు వేలల్లో భక్తులు తిరుమల వస్తుంటారు. అక్కడ దైవ దర్శనం కోసం పడిగాపులు కాస్తుంటారు. అలాంటి వారికి తిరుమల దేవస్థానం ఆహారవసతి సదుపాయాలు కల్పిస్తున్నా అందిని వాళ్లు చాలామందే ఉంటారుయ. అలాంటి వారంతా ప్రైవేటు వ్యక్తులు కల్పించే సౌకర్యాలపై ఆధారపడి ఉంటారు. ఇప్పుడు వాళ్లే మోసాలకు పాల్పడుతున్నట్టు వెలుగుచూసింది. పవిత్రమైన తిరుమలలో కల్తీ వస్తువులు, కల్తీ ఆహారం అమ్మకాలు సాగుతున్న తీరు భక్తులను ఆందోళన కలిగిస్తోంది. ఈ ఉదయం తిరుమలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు చేసిన దాడులు విస్తుగొలిపే నిజాలు వెలుగు చూశాయి.తిరుమలలో చాలా హోటల్స్‌లో కల్తీ సరకులతో తయారు చేసిన ఆహారపదార్థాలు దర్శనమివ్వడంతో అధికారులు షాక్ అయ్యారు. ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యంతో వండిన అన్నం, కల్తీ నూనెతో తయారు చేసిన వంటకాలు చూసిన అధికారులు నిర్వాహకులపై సీరియస్ అయ్యారు. వారిపై కేసులు పెట్టారు. ఇకపై ఇలాంటి నాసిరకమైన ఫుడ్ పెట్టినా, కల్తీ ఆహార పదార్థాలు వాడినా మరిన్ని కఠినమైన చర్యలు తీసుకుంటామని అంటున్నారు. టీటీడీ అన్నదాన ప్రసాదం అందిస్తున్నప్పటికీ అక్కడ భారీగా క్యూలైన్లు ఉండటం బస చేసే ప్రాంతానికి దూరంగా ఉందన్న కారణంతో చాలా మంది ఈ ప్రైవేటు హోటల్స్‌పై ఆధార పడుతున్నారు. అలాంటి వారే ఈ హోటల్స్ వారికి టార్గెట్ అవుతున్నారు. టీటీడీ అన్నప్రసాదం అక్కడక్కడా పెడుతున్నా సమయానికి అక్కడకు చేరుకోలేని వారికి ఈ హోటల్సే గతి. అందుకే వారు పెట్టిందే ఆహారం అవుతుంది.

# మరో మహిళతో అక్రమ సంబంధం

**విశాఖపట్టణం, జూలై 18 (ప్రజాస్వరం) :**

విశాఖ సీతమ్మధారలో ఓ భార్య. భర్తను చితకొట్టింది. మరొక మహిళతో కలిసి వేరొకచోట కాపురం పెట్టాడనే విషయం తెలిసి అక్కడికి వెళ్లింది. రెడ్‌హ్యాండెడ్‌గా ఇద్దరినీ పట్టుకుని కుటుంబసభ్యులతో కలిసి వారిపై దాడి చేసింది. కొంతకాలంగా వివేక్ దంపతుల మధ్య విభేదాలు ఉన్నాయి. దీంతో.. మరో మహిళతో కలిసి ఉంటున్నాడు వివేక్. తనకు విడాకులు ఇవ్వకుండా వేరే మహిళతో ఉండడం ఏంటని ప్రశ్నిస్తుంచిన ఆమె.. తన కోపాన్నంతా చేతల్లో చూపించింది. పాలకొండకు చెందిన వివేక్‌కి, బుచ్చయ్య పేటకు చెందిన హరితకు 2020లో పెళ్లయ్యింది.. మూడు నెలలకే ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి.. 2021 ఫిబ్రవరిలోనే భర్తపై హరిత కేసు పెట్టింది. ఆ తర్వాత విడాకుల పంచాయితీ మొదలైంది. అది తేలకుండా వివేక్ మరో మహిళతో కలిసి ఉంటున్నాడని తెలిసి హరిత వాళ్లపై దాడి చేసింది.

# పార్టీ నిర్మాణంపై జనసేన దృష్టి

**విజయవాడ, జూలై 18 (ప్రజాస్వరం) :**

పది రోజుల పాటు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నారు. జులై 18 నుంచి 28 వరకు నాల్గవ విడత జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. కొత్త సభ్యత్వ నమోదుతో పాటు, సభ్యత్వ రెన్యుల్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపింది. జనసేన క్రియాశీలక సభ్యులకు పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. ప్రతి ఒక్కరికి 5 లక్షల ప్రమాద జీవిత బీమా, 50 వేల వరకు ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తామని జనసేన పేర్కొంది.ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది వాలంటీర్లతో నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు జనసేన ప్రకటించింది. వెయ్యి మంది క్రియాశీలక సభ్యులతో మొదలైన పార్టీ ప్రస్థానం నేడు 6.47 లక్షల మంది క్రియాశీల సభ్యులతో కొనసాగుతోందని తెలిపింది. ఈ నెల 18 నుంచి ప్రారంభం అయ్యే క్రియా శీలక సభ్యత్వ నమోదులో 9 లక్షల సభ్యత్వాలు నమోదు చేయాలనేది లక్ష్యం అని జనసేన ప్రకటించింది. దీనికి అనుగుణంగా పార్టీ నాయకులు, నియోజకవర్గ నేతలు ప్రణాళికబద్ధంగా పనిచేయాలని పార్టీ సూచించింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సూచనల మేరకు ఈ ఏడాది ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది పార్టీ వాలంటీర్లకు లాగిన్ ఐడీ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపింది. పార్టీ సభ్యత్వం ప్రతి గ్రామం, ప్రతి వార్డులో నిర్వహించాలని శ్రేణులుక సూచించింది.

# ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యా బోధనకు కృషి

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**కొల్లాపూర్, జూలై 18 (ప్రజాస్వరం) :**

సీయం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యా బోధనకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపు తీసుకువచ్చిందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం చిన్నంబావి మండలం వెలటూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో రూ. 14.75 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అమ్మ ఆదర్శ పాఠశాల భవనాన్ని మంత్రి జూపల్లి ప్రారంభించారు. విద్యార్థులతోనూ మాట్లాడారు. విద్యా బోధన ఎలా ఉంది.. మధ్యాహ్న భోజనం బాగుంటుందా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చక్కగా పాఠాలు విని మంచి మార్కులు సాధించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం వసతుల కల్పన కోసం తాగునీరు, విద్యుత్, బాలికల టాయిలెట్స్ సుందరీకరణ పనులు చేపట్టిందని తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో సీఎస్ఆర్ ఫండ్స్ తో అనేక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశానని మంత్రి చెప్పారు. వెలటూర్ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ లో వసతుల కల్పనకు రూ. 25 లక్షల కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని,వారి పర్యవేక్షణ పెంచటం ద్వారా బడిలో చేరే పిల్లల సంఖ్య కూడా పెరుగుతుందని అన్నారు. ప్రైవేటు బడి మోజును తగ్గించి నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల వైపు పిల్లలను చేర్పించేందుకు స్వయం సహాయక సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# నెల రోజుల్లోనే 9 వేల కోట్లు

**ఓటర్లకు మించి లబ్ధిదారులు**

**విజయవాడ, జూలై 18 (ప్రజాస్వరం) :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ముందున్న ఆర్థిక సవాళ్లు సర్కారును కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందు ఉన్నఇప్పుడు తీవ్రమైన ఆర్థిక సవాళ్లు ఉన్నాయి. ఓ వైపు సంక్షేమ పథకాలను కొనసాగించడం మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడం కత్తిమీద సాముగా మారింది. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్ల చెల్లింపు భారాన్ని ఎదుర్కొంటోంది. ప్రభుత్వం ఏ పనిచేయాలన్నా డబ్బుతో ముడిపడి ఉండటం ప్రభుత్వాన్ని ఊపిరిసలపనివ్వడం లేదు. కేంద్ర ప్రభుత్వ సాయంతో పాటు ఆర్థిక వెసులుబాటు అందకపోతే పాలన ముందుకు నడవలేని పరిస్థితులు ఏపీలో నెలకొన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన వెనుక ఉద్దేశం కూడా ఇదేనని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రం ముందు ఉన్న ఆర్థిక సవాళ్లను కేంద్రానికి మొరపెట్టారు.ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల వ్యవధిలోనే ఆర్‌బిఐ వేలంలో రూ.9కోట్లను సమీకరించారు. జూన్ 12న రూ.2వేల కోట్లు, జూన్ 28న రూ.5వేల కోట్లు, జూలై 12న రూ.2వేల కోట్లను సమీకరించింది.ఆంధ్రప్రదేశ్‌లో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి ఏటా ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల రూపంలో రూ.52వేల కోట్ల రుపాయల్ని ప్రజలకు నేరుగా పంచిపెట్టారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే మరో రూ.20-30వేల కోట్ల రుపాయలు అదనంగా వెచ్చించాల్సిన పరిస్థితులు ఉన్నాయిఏపీలో సంక్షేమ పథకాల్లో భాగంగా తప్పనిసరిగా అందించే ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలతో ఏటా లబ్ధిదారులకు బదిలీ చేస్తున్న సొమ్ము ఏటా రూ.52వేల కోట్ల రుపాయలుగా ఉండేది. ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారులకు కొన్ని పథకాల్లో ప్రత్యక్ష నగదు బదిలీ అమలు చేస్తున్నారు. వీటిలో కొన్ని తప్పనిసరిగా అమలు చేయాల్సిన పథకాలు ఉన్నాయి.2019 నుంచి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న కొన్ని పథకాలను మరింత మెరుగ్గా తాము అమలు చేస్తామని చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార ప్రతిపక్షాలు పోటాపోటీగా తమను గెలిపిస్తే జనాలకు ఏమి చేస్తామో వివరిస్తూ వరాలు కురిపించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి కనీవిని ఎరుగని మెజార్టీని ప్రజలు కట్టబెట్టారు. ఎన్నికల హామీల్లో భాగంగా పెంచిన పెన్షన్లను ఇప్పటికే పంపిణీ ప్రారంభించారు. ఈ పథకంలో ప్రతి నెల రూ.3500కోట్ల రుపాయలను పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం ఖర్చు చేయనుంది.వైసీపీ ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాల్సిన పథకాలకే రూ.52వేల కోట్లను ఏటా చేయాల్సి వస్తే, చంద్రబాబు ఇచ్చిన హామీలు కలిపితే ఆ భారం మరింత పెరుగనుంది. టీడీపీ సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ఏటా రూ.73,440కోట్ల రుపాయలు అవసరమని ఏపీ ఆర్థిక శాఖ ఎన్నికలకు ముందు అంచనా వేసినట్టు సిద్ధం సభల్లో జగన్ చెప్పారు. బీసీలకు 50ఏళ్లకే పెన్షన్ పథకాన్ని కూడా కలుపుకుంటే మరో రూ.13,872 కోట్ల రుపాయలు అవసరం అవుతాయని జగన్ అప్పట్లో ఆరోపించారు. చంద్రబాబు ప్రకటించిన ఏడు పథకాలకు 87,312 కోట్ల రుపాయలు అవసరం అవుతాయని, ఇప్పటికే అమలు చేస్తున్న డిబిటి పథకాలతో కలిపితే అది రూ.1.40లక్షల కోట్లకు చేరుతుందనేది జగన్ మాట.

# కిడ్నీస్... ఫర్ సేల్....

**గుంటూరు, జూలై 18 (ప్రజాస్వరం) :**

గుంటూరు కిడ్నీ రాకెట్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కిడ్నీలా.. ఇడ్లీలా? 30 రూపాయలకు ప్లేట్ ఇడ్లీ అన్నంత ఈజీగా 30లక్షలకు ఓ కిడ్నీ అంటూ దందా చేస్తున్నారు కేటుగాళ్లు. సామాన్యుల కష్టాలను క్యాష్ చేసుకుంటున్నారు. బాధితులను నిందితులుగా చేస్తోన్న నయవంచన ఇప్పుడు మరో లెవల్. ఏపీలో సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసుతో సంబంధం ఉన్న నిందితులను అరెస్ట్ చేశారు పోలీసులు. మిగతా వారి కూడా వీలైనంత త్వరగా పట్టుకుంటామని చెప్పారు పోలీస్ అధికారులుగుంటూరు జిల్లాలో కలకలం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక పురోగతి సాధించారు పోలీసులు. బాధితుల ఫిర్యాదు మేరకు కిడ్నీ మార్పిడి రాకెట్‌పై గుంటూరు పోలీసులు విస్తృతంగా విచారణ చేపట్టారు. ఐపీసీ సెక్షన్‌లు 370, 470, 465, 466, 468, 471, 120(బి)తోపాటు మానవ అవయవాల మార్పిడి చట్టంలోని సెక్షన్ 18, 19, 20 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1, ఏ3 ముద్దాయిలను అరెస్ట్ చేశారు పోలీసులు. నిందితులు బాషా, సుబ్రమణ్యంలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కి తరలించారు పోలీసులు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మరోవైపు ఈ రాకెట్‌ను సీరియస్‌గా తీసుకున్న హోంమంత్రి వి అనిత గుంటూరు ఎస్పీ, విజయవాడ పోలీసు కమిషనర్‌తో పాటు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి సమగ్ర విచారణ జరిపి అందులో ప్రమేయం ఉన్న వారందరినీ పట్టుకోవాలని ఆదేశించారు.నిందితులు ఇద్దరిని అరెస్టు చేసిన గుంటూరు నగరంపాలెం పోలీసులు.. విచారణ అనంతరం న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. ఆర్థిక ఇబ్బందులతో మధుబాబు అనే వ్యక్తి కిడ్నీ అమ్ముకున్నాడు. అయితే, డాక్టర్లు, మధ్యవర్తి, కిడ్నీ గ్రహీత తనను దారుణంగా మోసం చేశారని.. రూ. 30 లక్షలు ఇస్తామని చెప్పి లక్ష కూడా ఇవ్వలేదని బాధితుడు మధుబాబు పోలీసులను ఆశ్రయించాడు. ఎడమ వైపు కిడ్నీ తీసుకుంటామని చెప్పి కుడి వైపు కిడ్నీ తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం తన ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని తనకు న్యాయం కావాలని అధికారులను ఆశ్రయించారు.

# ఘనంగా రొట్టెల పండుగ



**నెల్లూరు, జూలై 18 (ప్రజాస్వరం) :**

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన నెల్లూరు భార షాహిద్ దర్గా రొట్టెల పండుగ మెదలైంది. ఇప్పటికె రొట్టెల పండుగకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు అధికారులు. ప్రతి సంవత్సరం మోహారం తరువాత రోజు రొట్టెల పండుగను నిర్వహించడం జరుగుతుంది..21 వరకు ఐదు రోజుల పాటు ఈ రొట్టెల పండుగ జరగ నుంది. రొట్టెల పండుగలో అత్యంత ముఖ్యమైన గంధం ఘనంగా ముగిసిందిబారా షాహిద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి సైతం భక్తులు తరలి వస్తున్నారు. మామూలుగా మొహారం తరువాత రోజు నుంచి రొట్టెల పండుగ ప్రారంభం అవుతుంది. అయితే ప్రతి ఏడాది ఒక రోజు ముందు నుంచే భక్తులు తాకిడి అధికంగా ఉంటుంది. ఈ ఏడాది సైతం రొట్టెల పండుగకు ఒక రోజు ముందు నుంచే వేలాది మంది భక్తులు బారా షాహిద్ దర్గాకు తరలి వస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన రొట్టెల పండుగకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. దర్గా ప్రాంగణం మొత్తం రంగు రంగుల విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్వర్ణాల చెరువులో భక్తులు రొట్టెలు వదులు కునేందుకు వీలుగా ప్రత్యేక ఫ్లాట్ ఫామ్ లు సిద్ధం చేశారు. పండుగకు వచ్చే భక్తులకు మంచి నీరు, భోజనం, పార్కింగ్ పై ప్రత్యేక దృష్టి సారించారు అధికారులు.కోర్కెల రొట్టెలు ఇక్కడ పలు రకాల రొట్టెలు పంపిణీ జరుగుతుంది. ఆరోగ్య రొట్టె, కల్యాణ రొట్టె, విద్యా రొట్టె, వ్యాపార రొట్టె, ఉద్యోగ రొట్టె, సంతాన రొట్టె ఇలా అనేక రకాల రొట్టెలు ఉంటాయి. ఏ కోర్కె కోరుకుంటే ఆరొట్టె తీసుకుంటారు. కోర్కె తీరిన వారు వచ్చే ఏడాది రొట్టెల పండుగ నాడు తిరిగి ఇదే రొట్టెను చెల్లిస్తారు. ఎవరికైతే ఆ రొట్టె కావాలో వారు తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే రొట్టెల పండుగ పద్ధతి. రొట్టెల పండుగ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడ ఏ రొట్టె అందుబాటులో ఉందో తెలిసేలా స్వర్ణాల చెరువులో ప్రత్యేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.బారా షాహిద్ దర్గా రొట్టెల పండుగలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగురు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు తగ్గట్టు గానే అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిగా ఉన్న సమయంలో రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించారు. అయితే మరోసారి టీడీపీ అధికారంలోకి రావడం నారాయణ మంత్రిగా, శ్రీధర్ రెడ్డి ఎమ్మెల్యే గా ఉండడంతో మరోసారి రొట్టెల పండుగను విజయ వంతం చేసేందుకు ఆధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. రొట్టల పండుగకు పది లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారనే అంచనాలతో ఆ దిశగా ఏర్పాట్లు చేశారు అధికారులు..అధికార యంత్రాంగం తో పాటు టీడీపీ నేతలు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ఏర్పాట్లు పరిశీలించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

# వైట్ పేపర్ల.. రాజకీయం..

**విజయవాడ, జూలై 18 (ప్రజాస్వరం) :**

'ఏపీలో ఇసుక, రాళ్లు, గనులు సహా సర్వం దోచేశారు. ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారంటూ' చంద్రబాబు ప్రభుత్వం శ్వేత పత్రం పరంపర కొనసాగుతోంది. గత ప్రభుత్వ విధానాలు, లెక్కల్లో పెద్ద తిక మక ఉందంటూ శ్వేతపత్రాలు రిలీజ్ చేస్తోంది. ఈ వైట్ పేపర్ల చుట్టూ ఇప్పుడు ఏపీలో పొలిటికల్ ఫైట్స్ నడుస్తున్నాయి. ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్నామని టీడీపీ అంటోంది. కానీ అవి శ్వేతపత్రాలు కాదు జెలసీ పత్రాలని వైసీపీ అంటోంది. మొత్తంగా ఏపీలో వైసీపీ, టీటీడీ నేతల మధ్య శ్వేత యుద్ధమే నడుస్తోంది.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి.. గత ప్రభుత్వ విధానాలను వేలెత్తి చూపుతోంది. గడిచిన ఐదేళ్లలో ఏపీలో జరిగింది ఇదే.. ప్రస్తుతం ఇదీ ఏపీ పరిస్థితి అంటూ వైట్ పేపర్స్ రిలీజ్ చేస్తోంది. ఒక్కో అంశం మీద వైట్ పేపర్స్ రిలీజ్ చేస్తోంది చంద్రబాబు ప్రభుత్వం. ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుపై మొదట వైట్ పేపర్ రిలీజ్ చేసిన బాబు.. ప్రాజెక్టు వాస్తవ పరిస్థితిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే బాబు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే అమరావతిపై కూడా శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. అమరావతి గత ఐదేళ్లుగా ఎలా నిర్లక్ష్యానికి గురైందో వివరిస్తూనే అమరావతి పునరవైభవానికి కేంద్ర సహకారం గురించి తెలియచేశారు. వీటితో పాటు విద్యుత్, సహజవనరుల దోపిడీ పైనా శ్వేతపత్రాన్ని విడుదల చేశారు.ఏపీ ప్రజలకు వాస్తవాలు తెలియచేసే ఉద్దేశంతోనే తాను రంగాల వారీగా శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నా అంటున్నారు సీఎం చంద్రబాబు. రాష్ట్ర స్థితిగతులను పరిశీలించే కొద్దీ ప్రతి రంగంలోనూ ఎన్నెన్నో అవకతవకలు బయటపడుతున్నాయని, ఏ శాఖను చూసినా ఘోరమైన పరిస్థితులే ఉన్నాయని సీఎం వివరించారు. అధికారంలో ఉన్నాం కదా అన్ని ఎన్నో తప్పులు, తప్పుడు నిర్ణయాలు జరిగాయి. భూములు, ఇసుక, అడవులు, క్వారీలు.. ఇలా దేన్నీ వదిలిపెట్టకుండా వైసీపీ ప్రభుత్వం దోపిడీ చేసిందన్నారు. గతంలో ఎప్పుడూ లేనంత దోపిడీకి వైసీపీ పాల్పడిందనేది చంద్రబాబు వైట్ పేపర్ల సారాంశం.అధికారాన్ని అడ్డంపెట్టుకుని అహంకారంగా వ్యవహరించారని, చివరకు సహజ వనరులను సైతం వదలకుండా దోచేసుకున్నారంటూ చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతోనే ఈ శ్వేతపత్రాలు రిలీజ్ చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇప్పటిదాకా నాలుగు శ్వేతపత్రాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఇంకా మరికొన్ని అంశాలపైనా వైట్ పేపర్స్ రిలీజ్ చేస్తామని, వాటిపై అసెంబ్లీలో కూడా చర్చబెడతామంటున్నారు. ఈ శ్వేతపత్రాలే కాదు. టీడీపీ చేస్తున్న ఆరోపణలు కూడా పూర్తిగా అవాస్తవమే అంటోంది వైసీపీ. ఎన్నికల్లో ప్రజలకు అలవిగాని హామీలిచ్చి.. వాటిని అమలుచేయలేక శ్వేతపత్రాల పేరుతో ప్రజలను డైవర్ట్ చేస్తున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. పథకాలు ఎలా అమలు చేయాలి.. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే దాన్ని పక్కనబెట్టి తమపై బురదజల్లడమే ఎన్డీఏ సర్కార్ పనిగా పెట్టుకుందనేది వైసీపీ శిబిరం నుంచి వినిపిస్తున్న వాదన.బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నాం.. ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పాలి. ఆ తర్వాత అవసరమైన చర్యలు చేపట్టే ఆలోచనలో ఉంది చంద్రబాబు సర్కార్. అయితే శ్వేతపత్రాల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తోంది వైసీపీ. ఇన్ని ఆరోపణలు చేస్తున్న టీడీపీ.. ఏ ఒక్క అధికారి గానీ లేదంటే మంత్రి గానీ తప్పుచేసినట్టు తేల్చారా అని వైసీపీ ప్రశ్నిస్తోంది. దానికి టీడీపీ సైతం ధీటుగానే బదులిస్తోంది. ఇక బడ్జెట్ ప్రవేశ పెట్టే విషయంలోనూ పెద్ద రచ్చే నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓటాన్ బడ్జెట్‌నే తీసుకొచ్చే ఆలోచనలో కూటమి సర్కార్ ఉంది. దీన్ని కూడా వైసీపీ తప్పుబడుతోంది. సూపర్ సిక్స్ పథకాల అమలులో చిత్తశుద్ధి ఉంటే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతారు. అలా చేయడం లేదంటే ఏమిటి దానికి అర్థం అని ప్రశ్నిస్తోంది.దోపిడీ జరిగింది. అవినీతికి పాల్పడ్డారని ఆరోపించడమే కానీ.. ఎవరు తిన్నారు, ప్రభుత్వ ఆదాయానికి ఎవరు గండికొట్టారో చంద్రబాబు చెప్పగలరా అని వైసీపీ డిమాండ్ చేస్తోంది. పేదల కోసం పనిచేసిన తమకు అవినీతి మరక అంటించే ప్రయత్నం జరుగుతోందని వైసీపీ ఆరోపిస్తోంది. అధికారంలోకి వచ్చి 50 రోజులు కూడా కాలేదు. అప్పుడే తొందరపడితే ఎలా అంటోంది టీడీపీ. త్వరలోనే అన్నీ బయటకి వస్తాయ్.. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదంటోంది. మొత్తంగా శ్వేతపత్రాల పేరుతో వైసీపీని ఇరుకున పెట్టే ప్రయత్నం టీడీపీ చేస్తుంటే.. వైసీపీ నేతలు దీనిని తప్పుబడుతున్నారు. ఈ రెండు పక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

# కాకిలో ఉన్న ఐకమత్యం.... మామూలుగా లేదుగా

**కాకినాడ, జూలై 18 (ప్రజాస్వరం) :**

అంబేద్కర్ కోనసీమ జిల్లా తాటిపాక డైలీ మార్కెట్లో ఒక కాకి అరిచి విసిగిస్తుంది. చివరు ఏదోలా దాన్ని పట్టుకున్న చికెన్ షాప్ యజమాని తాడుతో కట్టేశాడు. కట్టేయడంతో కాకి మరింతగా అరవడం మొదలు పెట్టింది. అంతే వందల కాకులు వచ్చి వాలిపోయాయి. అరవడం మొదలెట్టాయి. కాకులు ఎవర్నీ ఏం చేయలేదు. కాలు కింద పెట్టలేదు. కట్టేసిన కాకిని వదిలి పెట్టే వరకు ఆ ప్రాంతంలో ఎగురుతూ గోల గోల చేశాయి. వాటి గోల స్థానిక ప్రజలు వాటి గోలను భరించలేకపోయారు. చివరకు కాకులు అనుకున్నది సాధించాయి. ఆ గోలతో చేసేదేమి లేక కట్టేసిన కాకిని చికెన్ సెంటర్ యజమాని వదిలేశాడు. అంతే ఆ కాకితో కలిసి మిగిలిన కాకులు ఎగిరిపోయాయి. పల్నాడు జిల్లా వినుకొండలో దారుణం జరిగింది. ఓ వ్యక్తిని అతి కిరాతకంగా మరో వ్యక్తి నరుకుతూ కనిపించాడు. అది కూడ ఆందరూ చూస్తుండగానే ఇద్దరూ గొడవ పడ్డారు. రాజకీయ గొడవలో, వ్యక్తిగత కక్ష ఏదైనా కానివ్వండి.. నడిరోడ్డుపై ఒక వ్యక్తిని మరో వ్యక్తి నరుకుతుండగా అటూ ఇటూ జనం తిరుగుతూనే ఉన్నారు. కానీ పట్టించుకున్న వారే లేరు. వినుకొండ వైఎస్ఆర్సీపీ నేత రషీద్‌పై ప్రత్యర్థి జిలానీ హేయంగా దాడి చేశాడు. అందరూ చూస్తుండగానే కత్తితో విచక్షణా రహితంగా నరికి చంపేశాడు. కత్తి చేసిన దాడిలో మొదట చేతులు తెగిపోయి బాధితుడు ఆర్తనాదాలు చేశాడు. వదిలేయాలని ప్రాథేయపడ్డాడు. అసలు తనకేమీ పట్టనట్టు జిలానీ తన చేతిలో ఉన్న కత్తితో నరుకుతూనే ఉన్నాడు. చుట్టపక్కల వారంతా ఆ దుర్ఘటనను చూస్తున్నారు. కానీ ధైర్యం చేసి జిలానీని అడ్డుకునే ప్రయత్నం మాత్రం చేయలేదు. చేతులు కాల్లు మెడ భాగంలో కత్తిగాట్లుతో తీవ్ర రక్త స్రావంలో కుప్పకూలిపోయాడు రషీద్. అతను పడిపోయాడని ధ్రువీకరించుకున్న జిలానీ ఆ తర్వాత గానీ అక్కడి నుంచి వెళ్లలేదు. జిలానీ అలా వెళ్లిన వెంటనే స్థానికులు పరుగెత్తుకొని వెళ్లి రక్తస్రావంలో పడి ఉన్న రషీద్‌ను తట్టిలేపారు. అప్పటికే అతను తుదిశ్వాస విడిచిపెట్టేశాడు. ఆ తర్వాతే పోలీసులు కూడా వచ్చారు. కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడ ఎవరు ఎలాంటి వారైనప్పటికీ చంపుకొని కొట్టుకునే హక్కు ఎవరికీ లేదు. ఓ చోట కాకిని కట్టేసినందుకే వందల కాకులు వచ్చి శాంతియుత మార్గంలో ధర్నా చేశాయి. తన తోటి కాకిని విడిపించుకునే వరకు అక్కడి నుంచి కదలకుండా ఉండిపోయాయి. మరో చోట తోటి మనిషిని నరుకుతుంటే వీడియో తీస్తున్న జనం ఏదోలా రక్షించాలనే ప్రయత్నం చేయలేదు. నోటితో వద్దు వద్దూ అనే మాట తప్ప వేరే ప్రయత్నం జరిగినట్టు కనిపించలేదు. వేడుక చూస్తున్నట్టు అక్కడి నుంచి చూసుకుంటూ ముందుకు సాగిన వాళ్లు కొందరైతే... ఏం జరుగుతుందో అని అక్కడే ఉండి ఎంజాయ్ చేసిన వాళ్లు మరికొందరు. ఇంత విజ్ఞానం సంపాదించి మానవుడు కనీసం కాకి పాటి సాయం చేయలేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ మనుషులను కించపరిచే ఉద్దేశం లేదు. అయినా సెల్‌ఫోన్ చేతికి వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు పెరిగిపోతున్నాయి. పక్కవాడు ఎలా పోతున్నా వీడియో తీస్తూనో రీల్స్ చేస్తూనో కాలం వెళ్లదీస్తున్నారు. ఇది మానవత్వానికి మాయని మచ్చలా మారుతున్నాయి.

# గిల్ తో పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన బ్యూటీ!

క్రికెట్ కు సినిమా రంగానికి అవినాభావ సంబంధం ఉంది. చాలా మంది స్టార్ క్రికెటర్లు హీరోయిన్స్ ను పెళ్లి చేసుకున్న విషయం మనకు తెలియనిది కాదు. విరాట్ కోహ్లీ-అనుష్క శర్మ ఇందుకు చక్కటి ఉదాహరణ. ఇక పలానా క్రికెటర్లు, పలానా హీరోయిన్స్ తో రిలేషన్ షిప్ లో ఉన్నారని ఎన్నో వార్తలు మనం వింటూనే ఉంటాం. టీమిండియా స్టార్ శుబ్ మన్ గిల్ గురించి రోజూ ఏదో ఒక వార్త వింటూనే ఉంటాం. కొన్ని రోజుల క్రితం ఓ హీరోయిన్ తో శుబ్ మన్ గిల్ పెళ్లి జరగబోతుందనే వార్త వైరల్ గా మారిన విషయం తెలిసిందే. తాజాగా గిల్ తో పెళ్లిపై క్లారిటీ ఇచ్చింది ఆ బ్యూటీ. పూర్తి వివరాల్లోకి వెళితే.. శుబ్ మన్ గిల్.. టీమిండియాలోకి వచ్చిన అతి కొద్ది కాలంలోనే అద్భుతమైన క్రికెటర్ గా గుర్తింపు సంపాదించుకున్నాడు. అలాగే జట్టులో స్థానం సుస్థిరం చేసుకున్నాడు. ఆటతో ఎంత పేరు తెచ్చుకున్నాడో.. ప్రేమ వ్యవహారాల్లో కూడా అంతే పేరు తెచ్చుకున్నాడు. సారా టెండుల్కర్ తో పాటుగా ఓ హీరోయిన్ తో రిలేషన్ లో ఉన్నట్లు న్యూస్ వైరల్ అయిన విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు ఏకంగా సీరియల్ హీరోయిన్ తో డిసెంబర్ లో పెళ్లి పీటలెక్కబోతున్నాడన్న వార్త హాట్ టాపిక్ గా మారింది. ఆ హీరోయిన్ పేరి రిద్ధిమా పండిట్. తాజాగా ఈ వార్తలపై క్లారిటీ ఇచ్చింది. రిద్ధిమా పండిట్ మాట్లాడుతూ..'శుబ్ మన్ గిల్ కు నాకు ఎలాంటి సంబంధం లేదు. అతడొక గొప్ప స్పోర్ట్స్ పర్సన్ అని నాకు తెలుసు. అంతే తప్ప నాకు అతడి గురించి ఇంకేం తెలీదు. ఒకవేళ గిల్ ని కలిస్తే ఈ రూమర్ గురించి చెప్పి నవ్వుకుంటాము. గిల్ చాలా క్యూట్ గా ఉంటాడు. అయితే పెళ్లి వార్తల్లో ఎలాంటి నిజం లేదు' అంటూ పెళ్లి రూమర్లపై క్లారిటీ ఇచ్చింది ఈ బ్యూటీ. కాగా.. గతంలో సచిన్ కూతురు సారా టెండుల్కర్, హీరోయిన్ సారా అలీఖాన్ లతో డేటింగ్ చేసినట్లు న్యూస్ వైరల్ గా మారింది.



# ఐసీసీ చైర్మన్‌గా జై షా.. బీసీసీఐ అధ్యక్ష పదవికి లైన్ క్లియర్!

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా.. అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి (ఐసీసీ) ఛైర్మన్‌గా పదవి చేపడతాడా? అని ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. శుక్రవారం (జులై 19) కొలంబోలో జరగనున్న ఐసీసీ వార్షిక సమావేశం (ఏజీఎం)లో ఈ విషయంపై చర్చించే అవకాశాలు ఉన్నాయి. జులై 19 నుంచి 22 వరకు ఐసీసీ సమావేశాలు జరగనున్నాయి. ఐసీసీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌లో మూడు స్థానాలకు వార్షిక సమావేశాల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలానే ఐసీసీ కొత్త ఛైర్మన్ గురించి, ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్‌కు భారత్ వెళ్తుందా? అనే విషయాలపై చర్చ సాగనుంది.ప్రస్తుతం న్యూజిలాండ్‌కు చెందిన గ్రెగ్ బార్క్లే ఐసీసీ ఛైర్మన్‌గా ఉన్నారు. 2025 వరకు అయనను కొనసాగించే అవకాశాలు లేకపోలేదు. ఒకవేళ జై షా పోటీ చేస్తే ఏకగ్రీవంగా ఎన్నికవుతాడు. జై షా ఐసీసీ ఛైర్మన్ అయితే.. బీసీసీఐ అధ్యక్ష పదవికి లైన్ క్లియర్ అవుతుంది. బీసీసీఐ రూల్స్ ప్రకారం.. ఓ వ్యక్తి 6 ఏళ్ల పాటు మాత్రమే వరుసగా పదవిలో కొనసాగే ఛాన్స్ ఉంది. ఇప్పటికే చాలా ఏళ్లుగా బీసీసీఐ కార్యదర్శిగా ఉంటున్నారు. కాబట్టి జై షా తప్పక విరామం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఐసీసీ ఛైర్మన్‌గా జై షా బాధ్యతలు అందుకుంటే.. 2028లో బీసీసీఐ అధ్యక్ష పదవి అందుకోవడానికి అతనికి లైన్ క్లియర్ అవుతుంది. ఐసీసీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం కారణంగా జై షాకు పోటీ కూడా ఉండదనే చెప్పాలి.





## గంభీర్ పై బీసీసీఐకి రోహిత్, కోహ్లీ ఫిర్యాదు

టీమిండియా కొత్త కోచ్ గంభీర్ కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బిగ్ షాక్ ఇచ్చారని సమాచారం. కోచ్ గా బాధ్యతలు చేపట్టే ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి నుంచి గంభీర్ ఆదనపు అధికారాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అతను జట్టు ఎంపికలో అధిక జోక్యం చేసుకుంటున్నట్లు అర్థమవుతుంది. ఇప్పటికే టీ20 ఫార్మాట్ లో రోహిత్ శర్మ వారసుడిగా సూర్య కుమార్ యాదవ్ ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యాను ఆటగాడిగానే కొనసాగించాలని గంభీర్ నిర్ణయించినట్లు నేషనల్ మీడియా కోడై కూస్తోంది. శ్రీలంక పర్యటనలో టీమిండియా మూడు టీ20లతో పాటు మూడు వన్డేలు ఆడనుంది. ఈ పర్యటన నుంచి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బూమ్రాలకు విశ్రాంతి ఇవ్వాలని సెలక్టర్లు భావిస్తున్నారు. అయితే శ్రీలంకతో వన్డే సిరీస్ కు సీనియర్ ఆటగాళ్ళంతా అందుబాటులో ఉండాలని గంభీర్%ో%. సెలెక్టర్లను కోరినట్లు వార్తలు వచ్చాయి. అంతేకాకుండా హోమ్ సీజన్ కు ముందు అతను ఎన్సీఏ వేదికగా ప్రాక్టీస్ క్యాంప్ నిర్వహించాలను కుంటున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే.. తాము శ్రీలంక టూర్ కు వెళ్లబోమని.. గంభీర్ పై బీసీసీఐకి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫిర్యాదు చేశారట.



## నన్ను వెనకుండి నడిపించారు: దూబె

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తనకు చాలా మద్దతు ఇచ్చారని టీమిండియా యువ ఆటగాడు శివమ్ దూబె తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2024లో ప్రతి మ్యాచ్ నుంచి ఎంతో నేర్చుకున్నానని, జట్టులోని సహచరులు అండగా నిలిచారన్నాడు. టీ20 ప్రపంచకప్ భారత జట్టు గెలవడంతో తన పాత్ర ఉండటం ఎంతో గర్వంగా ఫీలవుతున్నా అని దూబె చెప్పుకొచ్చాడు. పొట్టి టోర్నీలో దూబె 8 మ్యాచుల్లో 133 పరుగులు చేశాడు. ఫైనల్ మ్యాచ్‌లో కీలక సమయంలో 16 బంతుల్లోనే 27 పరుగులు చేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శివమ్ దూబె మాట్లాడుతూ 'టీ20 ప్రపంచకప్ ప్రయాణం చాలా బాగుంది. ఫైనల్ మ్యాచ్ అత్యంత కఠిన సవాల్ అని చెప్పాలి. జట్టు విజయంలో నా పాత్ర ఉండటం గర్వంగా ఫీలవుతున్నా. మెగా టోర్నీలో ప్రతి మ్యాచ్ నుంచి ఎంతో నేర్చుకున్నా. సహచరులు అండగా నిలిచారు. అభిమానులు నిరంతరం ఉత్తేజపరిచారు. ఫైనల్ మ్యాచ్లో జట్టు కోసం నా అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించే అవకాశం దక్కింది. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు ప్రయత్నించా. టోర్నీ ఆరంభంలో మాత్రం కాస్త ఇబ్బంది పడ్డా. ఆ సమయంలో కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ అండగా నిలిచారు. నా బలమేంటో చెప్పారు. వారి మద్దతు వల్లే రాణించగలిగా. నిరంతరం నా వెనకుండి నడిపించారు. నాపై వారికున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఆడా. భవిష్యత్తులోనూ జట్టు విజయాల్లో నా పాత్రను పోషించడానికి సిద్ధంగా ఉన్నా' అని తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత జింబాబ్వేతో టీ20 సిరీస్‌లో శివమ్ దూబె ఆడాడు. చివరి మ్యాచ్‌లో 12 బంతుల్లో 26 పరుగులు చేశాడు. దీంతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇక జులై 27 నుంచి ఆరంభం అయ్యే శ్రీలంకతో సిరీస్‌లో అతడికి చోటు ఖాయం. నేడు బీసీసీఐ భారత జట్టును ప్రకటించనుంది. ఈ సిరీస్‌లో కూడా రాణిస్తే.. భారత టీ20 జట్టులో సుస్థిర స్థానం అవుతుంది. ఇప్పటికే రోహిత్, కోహ్లీ, జడేజాలు వీడ్కోలు పలికిన నేపథ్యంలో యువకులకు అవకాశాలు దక్కనున్నాయి.

# పేస్‌ను రాబట్టడం చాలా కష్టం

పీఎల్‌తో వెలుగులోకి వచ్చిన స్పీడ్ బౌలర్ ఉమ్రాన్ మాలిక్. నిలకడగా 145ం వేస్తూనే మెగా లీగ్‌లో అత్యధికంగా 157 కి.మీ. వేగాన్ని తాకాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోనూ 156 కి.మీ. మార్క్‌కు చేరాడు. మూడేళ్ల కిందట ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన అతడికి 2022 సీజన్ బ్రేక్ ఇచ్చింది. 14 మ్యాచుల్లో 22 వికెట్లు తీసి సత్తా చాటాడు. అతడి పేస్ దెబ్బకు స్టార్ బ్యాటర్లు సైతం కంగుతిన్నారు. కానీ, ఆ తర్వాత లెంగ్త్‌ను కోల్పోవడంతో భారీగా పరుగులు సమర్పించుకున్న ఉమ్రాన్ జట్టులో స్థానాన్ని చేజార్చుకున్నాడు. భారత్ తరఫున ఎంపికైనప్పటికీ చోటును నిలబెట్టుకోలేదు. అతడి బౌలింగ్ ప్రదర్శన దారుణంగా పడిపోవడానికి కారణాలను భారత మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే విశ్లేషించాడు. "పేస్‌ను రాబట్టడం చాలా కష్టం. సహజసిద్ధంగా ఉమ్రాన్‌కు (అది అలవడింది. ఇలాంటి అరుదైన ప్రతిభకు సాన బెట్టాల్సిన అవసరం ఉంది. నిలకడగా 145 - 148 కి.మీ. వేగంతో బంతులేయడం చాలా కష్టం. కొందరు అంటున్నట్లు స్పీడ్ గన్ 160 కి.మీ. వరకు ఉంటుందంటే నమ్మను కానీ అతడికి బలం పేస్. చాలా వేగంగా పిచ్‌పై బంతిని సంధిస్తాడు. నిలకడగా అదే స్పీడ్‌తో బంతులేయడం అద్భుతం. కానీ, అతడు దానిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నాడనేది ముఖ్యం. టీ20ల్లో బంతిపై నియంత్రణ అత్యంత కీలకం. ఏమాత్రం లెంగ్త్ మిస్ అయినా బ్యాటర్లు విధించే శిక్షకు గురికావాల్సి ఉంటుంది. బౌలర్ ఇబ్బందులు ఎదుర్కోవడం ఖాయం. అప్పుడు కెప్టెన్ నమ్మకాన్ని కూడా కోల్పోవడం వల్ల జట్టులో సుస్థిరంగా స్థానం ఉండదు. ఇదే సమస్య ఉమ్రాన్ ఎదుర్కొంటున్నాడు. లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయాలంటే.. అతడు ఎక్కువగా రంజీ మ్యాచులు ఆడాలి. అప్పుడే పట్టు సాధించే అవకాశం ఉంది. మేం అతడిని రంజీల్లో ఆడేందుకు ఎక్కువగా ప్రోత్సహించాం. క్లిష్ట పరిస్థితుల్లో బౌలింగ్ వేయడం వల్ల నైపుణ్యాలకు పదును పెట్టేందుకు ఆస్కారం ఉంటుంది. తప్పకుండా భవిష్యత్తులో మంచి ప్రదర్శన చేస్తాడనే నమ్మకం ఉంది" అని పరాస్ మాంబ్రే తెలిపారు.



# శ్రీలంకతో వన్డే సిరీస్ కు కెప్టెన్ రోహిత్ శర్మనే!

శ్రీలంకతో వన్డే సిరీస్ నుంచి టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకుంటాడని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే వన్డే సిరీస్‌లో రోహిత్ ఆడే అవకాశాలు మెండుగానే ఉన్నాయని తాజాగా తెలిసింది. రోహిత్ నాయకత్వంలోనే భారత జట్టు బరిలోకి దిగనుందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు బీసీసీఐ లేదా రోహిత్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజాలు వన్డే సిరీస్ నుంచి విరామం తీసుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. విరాట్ ప్రస్తుతం లండన్‌లో ఉన్నాడు. కింగ్ శ్రీలంకతో వన్డే సిరీస్‌లో దాదాపుగా ఆడకపోవచ్చు. బుమ్రా, జడేజాలు కుటుంబంతో సరదాగా గడుపుతున్నారు. అయితే సీనియర్లూ అందుబాటులో ఉండాలని కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కోరినట్లు వార్తలు వచ్చాయి. శ్రీలంక పర్యటనకు భారత జట్టును నేడు ఎంపిక ఉండే అవకాశం ఉంది. మరోవైపు వ్యక్తిగత కారణాలతో హార్దిక్ పాండ్యా శ్రీలంకతో వన్డే సిరీస్‌కు దూరం కానున్నాడు. టీ20 ఫార్మాట్‌కు మాత్రం తాను అందుబాటులో ఉంటానని బీసీసీఐకి ఇప్పటికే చెప్పాడు. రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడంతో జట్టు పగ్గాలు ఎవరికి వస్తాయనేది ఆసక్తికరంగా మారింది. హార్దిక్‌తో పాటు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ పోటీలో ఉన్నాడు. కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కెప్టెన్సీపై తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి.



# తేజస్ కంచర్ల విభిన్నమైన చిత్రం

### ఉరుకు పటేల టైటిల్ రోల్‌తో మూవీ

హుషారు' వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన నటుడు తేజస్ కంచర్ల ఇప్పుడు మరింతగా ప్రేక్షకులకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం తేజస్ చేస్తున్న 'ఉరుకు పటేల' చిత్రం.. ప్రేక్షకులకు ఆయనని మరింత దగ్గర చేస్తుందని ఎంతో నమ్ముతున్నారు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'గెట్ ఉరిక్గి÷డ్' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. ఈ ఫస్ట్ లుక్‌తో పాటు చిత్ర వివరాలను తాజాగా మేకర్స్ తెలియజేశారు. ముందుగా ఈ పోస్టర్‌ను గమనిస్తే.. తేజస్ కంచర్ల పరిగెడుతుంటే అతని వెనుక కత్తిని ఎవరో విసిరేసినట్లు కనిపిస్తుంది. మరో వైపు మంగళసూత్రం, పోస్టల్ బ్యాలెట్ పేపర్, పాల క్యాన్ అన్నీ కనిపిస్తున్నాయి. ఇది గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రమని ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే తెలుస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని కలిగించేలా ఉంది. ఈ సినిమాలో ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఉంటాయనే దానికి సింబాలిక్‌గా పోస్టర్‌ని డిజైన్ చేశారు. అలాగే ఈ టైటిల్‌కు మాదిరిగానే.. సినిమా కూడా ఉరుకే ఉరుకు అన్నట్లుగా ఉంటుందనేలా ఈ ఫస్ట్ లుక్ క్లారిటీ ఇచ్చేస్తోంది. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ 'ఉరుకు పటేల' సినిమాను నిర్మిస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ సినిమాకు ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఇప్పటికే సినిమా చిత్రీకరణ పూర్తయ్యిందని.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తామని ఈ సందర్భంగా చిత్రయూనిట్ తెలియజేసింది.



# డిసెంబర్‌లో కన్నప్ప విడుదల

### పుష్ప-2తో పోటీకి సన్నద్ధం

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న చిత్రం 'కన్నప్ప' ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకుడు. భారీ బడ్జెట్, పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించిన ఈ సినిమా విడుదల కోసం సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా విష్ణు పెట్టిన పోస్ట్‌తో రిలీజ్‌పై కారిటీ వచ్చింది. 'డిసెంబరు 2024' అని ఆయన ట్వీట్ చేశారు. కన్నప్ప హ్యాష్‌ట్యాగ్ జోడించారు. విడుదల తేదీని త్వరలోనే ప్రకటించే అవకాశాలున్నాయి. 'పుష్ప 2' డిసెంబరు 6న రిలీజ్ చేయనున్నట్టు టీమ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. 'కన్నప్ప' డిసెంబరు మూడు,నాలుగో వారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయని సినీ వర్గాల సమాచారం.

ఈ పాన్ ఇండియా చిత్రంలో ప్రీతి ముకుందన్ హీరోయిన్. ప్రభాస్, అక్షయ్ కుమార్, శరత్‌కుమార్, మోహన్‌లాల్ తదితరులు ఈ సినిమాలో సందడి చేయనున్నారు. విష్ణు.. తిన్నడు పాత్ర పోషించారు. అధిక భాగం షూటింగ్ న్యూజిలాండ్‌లో జరిగింది. కన్నప్ప భక్తి




చిత్రం మాత్రమే కాదని, అదొక చరిత్ర అని మోహన్ బాబు ఓ సందర్భంలో అన్నారు. ఈ చిత్రానికి ఆయన నిర్మాతగా వ్యవహరించడంతో పాటు ఓ కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా టీజర్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రదర్శితమైన సంగతి తెలిసిందే. ఇటీవల సోషల్ మీడియాలోనూ విడుదలై, ప్రేక్షకులను అలరించింది.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ విడుదల చేయగా హాలీవుడ్ లెవల్లో ఉన్న ఈ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.ఒకవేళ ఇదే నిజమైతే మంచు విష్ణు భారీ సాహసం చేయబోతున్నాడు. ఎందుకంటే ఇప్పటికే డిసెంబర్‌ను బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ బుక్ చేసుకుంది. ముఖ్యంగా టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ మూవీ పుష్ప ది రూల్ రాబోతుంది. డిసెంబర్‌లో ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. అయితే ఈ సినిమాకు పోటీగా కన్నప్పను దించడం అనేది సాహసంతో కూడుకున్న పని అని ఇది కన్నప్పకు ఎఫెక్ట్ పడే అవకాశం ఉందని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. కాగా కన్నప్ప విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# అల్లు అర్జున్‌తో సుకుమార్ గొడవ పడ్డారా ?

### చిత్రం షూటింగ్ డిలేపై సర్వత్రా అనుమానాలు

ప్రస్తుతం టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రాలలో పుష్ప ఒకటి. బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రైజ్' కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతుంది. టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి గత రెండు రోజులుగా ఒక వార్త సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతుంది. దర్శకుడు సుకుమార్, అల్లు అర్జున్‌ల మధ్య ఉన్న రిలేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.ఆర్య సినిమాతో మొదలైన ఈ జర్నీ ఇప్పటివరకు కొనసాగుతుంది. అయితే తాజాగా వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తుంది. పుష్ప 2 షూటింగ్ చివరి దశలో ఉన్న క్రమంలో వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు.. దీంతో అల్లు అర్జున్ సుకుమార్ మీద ఉన్న కోపంతో తన గడ్డం తీసేసి ట్రిప్‌కు చెక్కేసారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే గడ్డం పెరిగే బన్నీ షూటింగ్‌కు వచ్చేలోపు సుకుమార్ ట్రిప్‌కు వెళ్లబోతున్నాడని తెలుస్తుంది. దీంతో ఈ విషయం నిజామా కాదా అనేది తెలియాలంటే చిత్రబృందం ప్రకటించేవరకు ఆగాల్సిందే. మరోవైపు వీరి గొడవ వలన ఈ షూటింగ్ వాయిదా పడిందని ఇప్పటికే ఆగష్టు నుంచి డిసెంబర్‌కు వాయిదా పడిన ఈ చిత్రం డిసెంబర్‌లో అయిన విడుదల అవుతుందా లేదా 2025 లోకి వెళుతుందా అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు ఈ మూవీ షూటింగ్ జూలై ఎండింగ్ నాటికి ముగించాలని అల్లు అర్జున్ ఆర్డర్ వేసినట్లు సమాచారం. అయితే షూటింగ్ పూర్తి కావడానికి ఇంకో నెల సమయం పడుతుందని. ఇప్పటికే కొన్ని ఎపిసోడ్‌లను సుకుమార్ రీడిజైన్ చేసినట్లు తెలుస్తుంది. దీంతో ఈ షూటింగ్ ఎఫెక్ట్ పడినట్లు సమాచారం. మరోవైపు వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో సుకుమార్ కన్విన్స్ కాకపోవడంతో అవి పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# ఫిల్మ్ సిటీలో శరవేగంగా తండేల్ చిత్రీకరణ

నాగచైతన్య, లేడీ పవర్‌స్టార్ సాయి పల్లవి రెండోసారి తెరపై సందడి చేయడానికి సిద్ధమయ్యారు. వీరిద్దరూ జంటగా 'తండేల్' సినిమా తెరకెక్కుతోంది. చందు మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. ప్రధాన పాత్రధారులపై కీలకమైన టాకీ పార్టును తెరకెక్కిస్తున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నాగచైతన్య, సాయిపల్లవి డీగ్లామర్ పాత్రల్లో నటిస్తున్నారు. పాత్రలు వేషం, సంభాషణలు అత్యంత సహజంగా ఉంటాయని, భారీ హంగులతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి పంచుతుందని సినీ వర్గాలు తెలిపాయి. 'విరాటపర్వం', 'గార్గి' చిత్రాల్లో నటనకుగానూ ఉత్తమ నటిగా రెండు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాల్ని సొంతం చేసుకున్నారు సాయిపల్లవి. ఈ సందర్భంగా ఆమెని 'తండేల్' సినిమా సెట్లో ఆ చిత్రబృందం సత్కరించింది.



# మహేశ్‌బాబు పుట్టిన రోజు




### ఆగస్ట్ 9న మురారి రీ రిలీజ్‌కు న్నాహాలు

మహేష్ బాబు పుట్టినరోజైన ఆగస్టు 9న అభిమానులు తమ అభిమాన నటుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుతూ ఉండటం ఆనవాయితీ. అయితే ఈ సంవత్సరం మహేష్ బాబు అభిమానులు రాజమౌళితో సూపర్ స్టార్ చెయ్యబోయే సినిమా గురించి ఏదైనా సమాచారం ఆరోజు ఇస్తారేమో అని ఎదురు చూస్తున్నారు. కానీ అటువంటిదేమీ ఉండకపోవచ్చు అని తెలుస్తోంది. ఎందుకంటే ఆ సినిమా ఇంకా ప్రీ ప్రొడక్షన్ స్టేజ్ లోనే వున్నట్టుగా భోగట్టా, అందుకని ఆ సినిమా నుండి ఎటువంటి అప్డేట్ ఉండకపోవచ్చు అని అంటున్నారు. అయితే ఆగస్టు 9 న మహేష్ అభిమానులు ఇంకో విధంగా సంబరాలు చేసుకోవచ్చు. 'మురారి' సినిమాని ఆగస్టు 9న మళ్ళీ థియేటర్స్ విడుదల చేస్తున్నారు. మహేష్ బాబు కెరీర్ తొలినాళ్లలోనే దర్శకుడు కృష్ణ వంశీ తో పనిచేసే అవకాశం దక్కింది. కృష్ణ వంశీ, మహేష్ బాబు కాంబినేషన్ లో వచ్చిన 'మురారి' సినిమా మహేష్ బాబు కెరీర్ లో ఒక కీలకమైన సినిమాగా చూపొచ్చు. ఇందులో మహేష్ బాబు నటన అత్యుత్తమంగా ఉంటుంది. ఈ సినిమా అప్పట్లో విజయవంతమైన సినిమా. నందిగం రామలింగేశ్వర రావు నిర్మాత. మహేష్ బాబు కథానాయకుడిగా నటించడం మొదలు పెట్టిన తరువాత 'మురారి' అతనికి నాలుగో సినిమా. ఈ సినిమాలో పాటలు అన్నీ పెద్ద విజయం సాధించాయి. మణిశర్మ సంగీతం ఈ సినిమాకి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే సినిమా కుటుంబ సమేతంగా చూసే సినిమా కూడాను. కృష్ణవంశి అత్యద్భుతంగా తెరకెకెక్కించిన సినిమాలలో 'మురారి' ఒకటి. ఇందులో సోనాలి బెంద్రే కథానాయికగా నటించింది. సత్యనారాయణ, ప్రసాద్ బాబు, శివాజీ రాజా, చిన్నా, అల్లరి రవి బాబు, గొల్లపూడి, రఘుబాబు లాంటి నటీనటులు చాలామంది వుంటారు. లక్ష్మి ఇందులో మహేష్ బాబు తల్లిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటించగా, సుకుమారి అనే మలయాళం నటి మహేష్ బాబు నాయనమ్మగా ఇంకో ముఖ్యపాత్రలో కనపడతారు. అందరూ ఎంతో సహజసిద్ధంగా నటించి మెప్పించిన ఈ 'మురారి' సినిమా ఆగస్టు 9న మహేష్ జన్మదిన సందర్భంగా మళ్ళీ థియేటర్స్ లో విడుదలవుతోంది. అభిమానులు ఈ సినిమాతో మహేష్ జన్మదిన వేడుకల్ని సంబరంగా జరుపుకోవచ్చు అని అనుకుంటున్నారు.

# సెప్టెంబర్‌లో సైమా అవార్డుల ప్రదానం

### జైలర్‌తో పోటీ పడుతున్న దసరా నాని

సౌత్ ఇండియా ఇంటర్నేషనల్ మూవీ అవార్డు సైమా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సెప్టెంబరు 14, 15వ తేదీల్లో దుబాయ్ వేదికగా జరుగనుంది. ఇప్పటికే ఈ అవార్డుల కోసం పోటీ పగుతున్న చిత్రాలు, నటీనటులు, టెక్నీషియన్ల జాబితా తాజాగా వెల్లడైంది. అయితే ఇందులో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్' ఏకంగా 12 విభాగాల్లో, తెలుగులో నాని నటించిన దసరా 11 విభాగాల్లో, హాయ్ నాన్న 10 విభాగాల్లో, మలయాళంలో టోవినో థామస్ నటించిన 2018, కన్నడలో దర్శన్ నటించిన కాటేరా 8 విభాగాల్లో సైమా అవార్డుల కోసం పోటీ పడుతుండడం విశేషం. తెలుగులో ఉత్తమ చిత్రం జాబితాలో దసరా, బలగం, బేబీ, భగవంత్ సింగ్ కేసరి, హాయ్ నాన్న , విరూపాక్ష చిత్రాలు ఉండగా. ఉత్తమ నటులు జాబితాలో చిరంజీవి, బాలకృష్ణ, నాని, ధనుష్, సాయి ధరమ్ తేజ్ పోటీ పడుతున్నారు. ఉత్తమ కథానాయికల జాబితాలో శ్రీలీల, సంయుక్త, పాయల్ రాజ్ పుత్, కీర్తి సురేశ్, శృతి హసన్, మృణాల్ ఠాకూర్ ఉన్నారు. ఉత్తమ దర్శకులుగా అనీల్ రావిపూడి, గోపీచంద్, సాయి రాజేశ్, బాబీ, కార్తీక్ దండు ఉన్నారు. ఉత్తమ సోర్టింగ్ యాక్టర్స్‌గా బ్రహ్మానందం, రవికృష్ణ, అంగద్ బేడీ, విరాజ్ అశ్విన్, పృథ్వీరాజ్ సుకుమారన్, దీక్షిత్ శెట్టి ఉన్నారు. తమిళంలో ఉత్తమ చిత్రం జాబితాలో నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన 'జైలర్', మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఉదయనిధి, వడివేలు నటించిన 'మామన్నన్', లోకేశ్ కనగరాజ్ లియో, మణిరత్నం పొన్నియిన్ సెల్వన్-2, వెట్రిమారన్ దర్శకత్వం వహించిన విడుదలై వంటి చిత్రాలున్నాయి. అదేవిధంగా తమిళంలో ఉత్తమ నటుల విభాగంలో రజనీకాంత్, విజయ్, విక్రమ్, శివకార్తికేయన్ (మావీరన్), ఉదయనిధి ఉన్నారు. ఉత్తమ నటి విభాగంలో త్రిష, నయనతార, ఐశ్వర్యా రాయ్, కీర్తి సురేష్, మీతా రఘునాథ్. ఐశ్వర్య రాజేష్ ఉన్నారు. ఉత్తమ దర్శకుల కేటగిరీలో నెల్సన్, లోకేష్ కనకరాజ్, మణిరత్నం, వెట్రిమారన్, అరుణ్ కుమార్, మారి సెల్వరాజ్ ఉన్నారు.





Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154